

ఎన్నిసార్లు తిరగాలి..?



బర్త్ సర్టిఫికెట్ల కోసం రోడ్డెక్కిన దరఖాస్తుదారులు
- వివరాలు 7లో..

ఆగని కర్ణాటక మద్యం

బెల్టుషాపుల చాటున విక్రయాలు
దాడులు చేస్తున్నా బెదరని వైనం
నాయకుల కనుసన్నల్లోనే సరఫరా
చోద్యంచూస్తున్న ఉన్నతాధికారులు



7లో..

అరటి సాగు అదుర్స్

అన్నదాతల జాగ్రత్తలతో
అధిక దిగుబడులు
పండిన పంట
విదేశాలకు ఎగుమతి



6లో..

ఇద్దరు పెళ్లాల ముద్దుల దొంగ..!

ఏడుగురు పిల్లలతో పోషణ భారం
దిక్కుతోచక చోరీలకు దిగిన పెయింటర్
ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో 41 కేసులు
మరో ఇద్దరితో కలిపి పట్టుకున్న పోలీసులు
31తులాల బంగారం.. కారు స్వాధీనం



7లో..

అక్రమార్కుల్లో

వణుకు..!

వైసీపీ హయాంలో భూదోపిడీ
అంతేలేని అసైన్డ్ అక్రమాలు
రాష్ట్రంలో టాప్-10 మండలాలు జిల్లాలోనే..

కఠిన చర్యలకు కూటమి సర్కారు నిర్ణయం



రెవెన్యూ అధికారులపై క్రిమినల్ కేసుల నమోదుకు చర్యలు

బెంబేలెత్తుతున్న అక్రమార్కులు

పుట్టపర్తి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ఫ్రీహోల్డ్ మాటున అసైన్డ్ భూదందా సాగించారు. ఆ పార్టీ నాయకులు, అనుకూల స్థిరాస్తి వ్యాపారులు బినామీ పేర్లతో ఎకరాల కొద్దీ భూములను అక్రమ మార్గంలో సొంతం చేసుకున్నారు. ఆ పార్టీకి మద్దతుగా నిలిచిన స్థిరాస్తి వ్యాపారులు సైతం దోచేశారు. రాష్ట్రంలోనే అధిక మొత్తంలో జిల్లాలోనే భూములను కాజేసినట్లు తేలింది. అంతేకాదు, రాష్ట్రంలోనే అత్యధికంగా భూములను అసైన్డ్, ఫ్రీహోల్డ్ నిషిద్ధ జాబితా నుంచి తొలగించిన టాప్-10 మండలాలు జిల్లాలోనే ఉండడం శోచనీయం. ఈ లెక్కన జిల్లాలో భూదందా ఏస్థాయిలో సాగిందో అర్థం చేసుకోవచ్చు. వైసీపీ భూరాబందులు, ఆ పార్టీ స్థిరాస్తి వ్యాపారుల అక్రమాలకు అప్పట్లో కొందరు రెవెన్యూ అధికారులు అన్నివిధాలా సహకరించారు.



పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫ్రీహోల్డ్ రికార్డులను పరిశీలిస్తున్న సిబ్బంది (ఫైల్)

నిబంధనలు ఉల్లంఘించి అసైన్డ్ భూములను వారి చేతిలో పెట్టారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక అసైన్డ్ భూదందాపై దృష్టిపెట్టింది. చర్యలకు ఉపక్రమించింది. అడ్డగోలుగా భూములను కట్టబెట్టిన రెవెన్యూ అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఆ మేరకు కేసులు నమోదు చేయనుంది. దీంతో వైసీపీ భూదందాకు సహకరించిన, వారితో అంటకాగిన రెవెన్యూ అధికారుల్లో వణుకు మొదలైంది.

క్రిమినల్ చర్యలకు గ్రీన్‌సిగ్నల్

అసైన్డ్ ఫ్రీహోల్డ్ భూములకు యాజమాన్య హక్కుల కల్పన ముసుగులో నిషిద్ధ 22(ఏ) జాబితా నుంచి అక్రమంగా తొలగించడమే కాకుండా కొన్నింటి రిజిస్ట్రేషన్లకు సహకరించిన రెవెన్యూ అధికారులపై ఉక్కుపాదం మోపేందుకు కూటమి సర్కారు సిద్ధమైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నాలుగు రోజుల క్రితం రెవెన్యూ శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్షలో ప్రభుత్వ భూముల దురాక్రమణదారులతో అంటకాగిన రెవెన్యూ అధికారులపై చర్యలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో వారిలో వణుకు మొదలైంది. జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వంలో నిషేధిత 22(ఏ) ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్, అసైన్డ్ చుక్కల, షరతుగల, అసైన్డ్ పట్టా ఫ్రీహోల్డ్ భూములను కాజేసి, రూ.కోట్ల విలువైన లక్షల ఎకరాల అసైన్డ్ భూదందా సాగిన సంగతి తెలిసిందే. దీనిపై నిగ్గుతేల్చేందుకు కూటమి ప్రభుత్వం లోతైన విచారణకు ఆదేశించింది. ఆగస్టులో రెవెన్యూ శాఖ క్షేత్రస్థాయిలో పరిశీలించింది. నాలుగు దశల్లో సమగ్ర విచారణ చేపట్టింది. జిల్లావ్యాప్తంగా 1,92,329 ఎకరాల అసైన్డ్ భూములకు ఫ్రీహోల్డ్ (యాజమాన్య హక్కులు) కల్పించారు. ఆరునెలల్లో జిల్లాలోని తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో నిషిద్ధ జాబితా భూముల 22(ఏ)తోపాటు ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్ 5242.99 ఎకరాలు జరిగినట్లు లెక్క తేల్చారు. పునఃపరిశీలనలో సీసీఎల్‌ఏ నివేదిక ప్రకారం రెవెన్యూ చట్టాలను ఉల్లంఘించి జిల్లాలో నిషిద్ధ జాబితా, ఫ్రీహోల్డ్ విలువైన భూములు ప్రైవేటు వ్యక్తులు సగానికి సగం కట్టబెట్టినట్లు తేలింది. ఇందులో కీలకంగా వ్యవహరించిన అధికారులపై పక్కా ఆధారాలతో క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రెవెన్యూ శాఖకు ఆదేశాలు అందాయి. చట్ట ఉల్లంఘన, సర్వీసు రూల్స్ అతిక్రమణ, అక్రమార్కులతో చేతులు కలిపి ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించడం, తప్పుడు నివేదికలు, రికార్డులు సృష్టించడం, ఫోర్జరీ, ఫైళ్ల తారుమారు తదితర అభియోగాలతో క్రిమినల్ కేసులు పెట్టాలని రెవెన్యూ శాఖ ప్రతిపాదించింది. ఇందుకు కూటమి సర్కారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.



ఫ్రీహోల్డ్ భూముల రికార్డులను పరిశీలిస్తున్న రెవెన్యూ బృందం (ఫైల్)

టాప్-10 మండలాలు జిల్లాలోనే..

అసైన్డ్ రికార్డుల పునఃపరిశీలనలో అత్యధిక భూఅక్రమాలకు పాల్పడిన రాష్ట్రంలోనే తొలి పది మండలాలు జిల్లాలోనే ఉన్నట్లు తేలడం శోచనీయం. దీనిని సీసీఎల్‌ఏ నివేదిక బహిర్గతం చేసింది. ముద్దిగుబ్బ, అమరాపురం, పెనుకొండ, సోమందేపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాల్లోనే 93,293 ఎకరాలు ఫ్రీహోల్డ్ చేయగా.. 53415 ఎకరాలను అక్రమంగా జాబితా నుంచి తొలగించినట్లు పునఃపరిశీలనలో తేల్చారు. ధర్మవరం, పెనుకొండ, చిలమత్తూరు, హిందూపురం, బుక్కపట్నం, చెన్నేకొత్తపల్లి, కదిరి, మడకశిర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో అత్యధికంగా ఫ్రీహోల్డ్ అసైన్డ్ 5242.99 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేశారు. ఫ్రీహోల్డ్ చేసి రిజిస్ట్రేషన్ జరిగిన భూముల్లో అత్యధికంగా వైసీపీ నేతలతోపాటు ఆ పార్టీ అనుకూల స్థిరాస్తి వ్యాపారులు కొందరు బినామీల పేరుతో ముందస్తు అగ్రిమెంట్లు, కొనుగోలు చేసినట్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రాప్తాడు, పెనుకొండ నియోజకవర్గాల్లో పెద్దఎత్తున భూఅక్రమాలకు పాల్పడినట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో వెలుగు చూసింది. వైసీపీ నేతలు, అప్పటి రెవెన్యూ అధికారులు కుమ్మక్కై ఫ్రీహోల్డ్ మాటున యథేచ్ఛగా అసైన్డ్ భూములు దోచేశారు. అక్రమాలకు సహకరించిన అధికారులపై క్రిమినల్ చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించడంతో వారు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.

రోడ్డు విస్తరణలో నష్టపోయిన పాఠశాలలకు పరిహారం

కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా నష్టపోయిన ప్రభుత్వ పాఠశాలలకు పరిహారం చెల్లించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో మంగళవారం రోడ్లు భవనాలు, జాతీయ రహదారులు, విద్యాశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 4 ప్యాకేజీల కింద జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయన్నారు. తద్వారా జిల్లాలోని తలుపుల, కదిరి, ఓబుళదేవరచెరువు, చిలమత్తూరు, గోరంట్ల, పుట్టపర్తి, ముదిగుబ్బ, బుక్కపట్నం తదితర మండలాల్లో పలు ప్రభుత్వ పాఠశాలలు పాక్షికంగా, కొన్నిచోట్ల పూర్తిగా తొలగించారన్నారు. ఆయా పాఠశాలలను సంబంధితాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఈనెల 10లోపు నష్టాల నివేదికలు తయారుచేసి అందించాలన్నారు. సమీక్షలో డీఈఓ కిష్టప్ప, ఈఈ శంకరయ్య, డీఈ చిదంబరం, పలువురు ఎంఈఓలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించండి: ఎస్పీ రత్న



పుట్టపర్తి రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెరిగిపోతున్న సైబర్‌నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ రత్న.. పోలీసు అధికారులను ఆదేశించారు. పుట్టపర్తిలోని డీపీఓలో మంగళవారం సైబర్‌నేరాలపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు ఎన్ని సైబర్ నేరాలు నమోదయ్యాయి, ఎన్నింటిని పరిష్కరించాల్సి ఉందనే వివరాలు ఆరాతీశారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ప్రజలు పడకుండా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. సైబర్ నేరగాళ్ల బారిన పడినవారు వెంటనే 1930కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. నేషనల్ సైబర్‌క్రైం పోర్టల్ www.cyber-crime.gov.inలో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సైబర్‌క్రైం సీఐ తిమ్మారెడ్డి, డీసీఆర్బీ సీఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

- గోరంట్లలో భారీ వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నదులను తలపించిన వీధులు
- జిల్లావ్యాప్తంగా వాన
- విద్యుత్ సరఫరాలో అంతరాయం

దంచికొట్టిన వాన



గోరంట్లలోని వీధిలో ప్రవహిస్తున్న నీరు



ధర్మవరం మండలం గుడుదపల్లి వద్ద తడిసిన ధాన్యపురాసిని చూపుతున్న రైతు ఆంజనేయులు



గోరంట్ల వద్ద పెద్దచెరువు వంక ప్రవాహాన్ని దాటుతున్న ప్రజలు



ముదిగుబ్బ మండలంలో దెబ్బతిన్న వరిపంట

గోరంట్ల, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావంతో పట్టణంలో మంగళవారం సాయంత్రం వాన దంచికొట్టింది. రెండున్నర గంటలపాటు భారీ వర్షం కురిసింది. ఒకేసారి 127.2 మి.మీ, వర్షపాతం నమోదవడంతో వంక వీధిలోని లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరుచేరింది. భారీ వర్షం కారణంగా వ్యాపారులు, ప్రజలు వాహనదారులు ఇబ్బంది పడ్డారు. చౌడేశ్వరీకాలనీ, ఎస్సీకాలనీ వద్ద నుంచి ప్రాథమిక పాఠశాల, ఆర్కే థియేటర్ వీధి గుండా సంగం పట్టణంలోని వర్షపు నీరు వంకకు చేరడంతో ఉధృతంగా ప్రవహించింది. మసీదు సర్కిల్, వంకవీధి కూడలిలో కమ్మవారిపైపు వెళ్లే వాహనాలను ఆపివేశారు. పలు ఇళ్లలోకి నీరు చేరడంతో సామగ్రి, నిత్యవసర సరుకులు నీటి పాలయ్యాయి. రాత్రివరకు జడివాన కురుస్తుండడంతో నష్టం వివరాలు తెలియరాలేదు. శివాలయం వీధికి చెందిన కృష్ణమూర్తి రెండ్రోజుల క్రితం వరి పంట కోసి కల్లంలో నిలువ చేసిన 50 బస్తాల వడ్లను నీరు చుట్టుముట్టాయి. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా ఉండడంతో తుఫాను ప్రభావం పోయిందని రైతు భావించాడు. సాయంత్రం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి వడ్లకుప్పపై ప్లాస్టిక్ కవర్లు కప్పినా, చుట్టు నీరు చేరింది. కదిరి రహదారిలోని వంక ఉధృతంగా ప్రవహిస్తోంది.

అలుముకున్న అంధకారం

కొత్తచెరువు: జిల్లాలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి పలు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం, నల్లమాడ, గోరంట్ల మండలాల్లో అంధకారం అలుముకుంది. సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రైతు కష్టం... వానపాలు

ధర్మవరంరూరల్: ఫెంగల్ తుఫాను ప్రభావంతో మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వరి పంట కోత కోసి, రైతులు కల్లాల్లోకి తరలించారు. మరికొన్నిచోట్ల కోతదశకు చేరుకుంది. ఈ సమయంలో వర్షం కారణంగా రైతులు నష్టపోయారు. చిగిచెర్ల గ్రామ రైతు నారాయణస్వామి, గరుడంపల్లికి చెందిన ఆంజనేయులు వరికోత కోసి, ధాన్యాన్ని కల్లాల్లోకి తరలించారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి ధాన్యంపై టార్పాలిన్లు కప్పారు. అయినా వరి ధాన్యం కిందకు వర్షపునీరు చేరి తడిసిపోయింది. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి రేయింబవళ్లు కష్టించి పంటను కాపాడుకుంటే ధాన్యం గింజలు తడిసిపోయి తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గింజలు తడిసిపోతే పనికిరావని మొలకెత్తే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

ముదిగుబ్బ: వర్షానికి మండల కేంద్రంలోని పాత

నేలకొరిగిన వరిపంట

ఊరికి చెందిన రైతు రమేశ్‌బాబు సాగు చేసిన వరిపైరు నేలకొరిగింది. రైతు మూడెకరాల్లో వరి సాగుచేశాడు. పంట నేలకొరగడంతో రూ.2లక్షల దాకా నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు.

చట్టసభల్లో బీసీలకు 50శాతం

రిజర్వేషన్ కల్పించాలి

- బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ యాదవ్



బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడిగా నియామకపత్రం అందుకుంటున్న ఆంజనేయులు

ధర్మవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చట్టసభలతోపాటు అన్ని ప్రభుత్వ రంగ సంస్థల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం సభ్యుల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా సద్దాల ఆంజనేయులును రవికుమార్ యాదవ్ నియమించారు. నియామకపత్రాలను అందజేశారు. రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో బీసీలు రాజకీయాలకు అతీతంగా ఉద్యమిస్తే రాజ్యాధికారం సాధించగలరన్నారు. ఏపీలో యుద్ధప్రాతిపదికన జనగణన పూర్తిచేసి, చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమసంఘం నాయకులు ఆదినారాయణ, బెస్త వెంకటశివ, నిమ్మల మారుతీకుమార్, బిల్లే రామకృష్ణ, వేల్పుల అరవింద్ పాల్గొన్నారు.

ధరాఘాతం..!



విరగ్గాసిన దానిమ్మ చెట్లు

ఒక్కసారిగా పడిపోయిన దానిమ్మ ధరలు

సగానికిపైగా పతనం

నష్టాల పాలవుతున్న రైతులు

తాడిమర్రి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులకు నెల రోజుల క్రితం వరకు సిరులు కురిపించిన దానిమ్మ ఇప్పుడు నష్టాల పాలు చేస్తోంది. పది రోజుల వ్యవధిలోనే ధరలు తల్లకిందులవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. దానిమ్మ పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చి ఇప్పుడు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి రావడం పట్ల అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. పది రోజుల క్రితం వరకు టన్ను రూ.లక్ష వరకు దానిమ్మ ధరలు పలికాయి. ప్రస్తుతం రూ.30వేల నుంచి రూ.50వేలలోపే అమ్ముడవుతోంది. దిగుబడులు పెరగడం, మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా డిమాండ్ తగ్గడం ధరల పతనానికి కారణాలుగా తెలుస్తోంది.

నష్టాలే మిగిలాయి..

మండలవ్యాప్తంగా దాదాపు వంద హెక్టార్లలో దానిమ్మ సాగవుతోంది. కష్టనష్టాలకోర్చి రైతులు పంట పండించారు. దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. ఎకరాకి 8 నుంచి 10 టన్నుల దిగుబడులు సాధించారు. పది రోజుల క్రితం వరకు టన్ను ధర రూ.లక్ష వరకు పలకడంతో అన్నదాతల ఆనందానికి అవధుల్లేవు. అప్పుల ఊబి నుంచి బయటపడొచ్చని సంబర పడ్డారు. వారి ఆశలపై ధరలు నీళ్లు చల్లాయి. ఎకరంలో దానిమ్మ సాగుచేసి, దిగుబడి సాధించాలంటే సేద్యపు పనులు, మొక్కలు, మందులు, ఎరువులకే దాదాపు రూ.2లక్షలు ఖర్చవుతుంది. రెండేళ్లపాటు ఎదురుచూసి దిగుబడి సాధిస్తే ప్రస్తుతం ఎకరాకు రూ.3లక్షలకు మించి కూడా రావట్లేదని రైతులు వాపోతున్నారు.

దిగుబడి ఆశాజనకంగా ఉన్నా.. ఫలితం లేదు: ప్రతాప్, రైతు, ఏకపాదంపల్లి



నాలుగెకరాల్లో దానిమ్మ సాగుచేశా. రూ.8 లక్షలు పెట్టుబడి పెట్టా. కష్టపడి మంచి దిగుబడి సాధించా. లాభాలు వస్తాయని ఆశలు పెంచుకున్నా. ధర పడిపోవడంతో నష్టపోతున్నా. పదిరోజుల్లోనే తారుమారైంది. సగానికి సగం ధర తగ్గిపోయింది.

దిక్కుతోచని పరిస్థితి..: - రామ్మోహన్, రైతు, రామాపురం



మూడెకరాల్లో దానిమ్మ సాగుచేశా. రూ.6 లక్షలు పెట్టుబడి పెట్టా. పంట కోసే సమయానికి ధర పడిపోయింది. పెట్టుబడి కూడా దక్కేలా లేదు. దిక్కుతోచని స్థితిలో పడ్డా.

'అపార్' ఇబ్బందులు తొలగించండి

విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను కోరిన మంత్రి పయ్యావుల కేశవ్

అనంతపురం/ఉరవకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అపార్ జనరేషన్‌లో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కోరారు. ఈ మేరకు మంగళశారం ఆయన అమరావతి లోని రాష్ట్ర సచివాలయంలో విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. జిల్లాలో రెండ్రోజుల కిందట బెళుగుప్ప మండలం కోనాపురం నుంచి గోళ్ల గ్రామానికి వెళ్తుండగా... మార్గమధ్యంలో పొలాల్లో పనిచేస్తున్న కూలీలతో తాను మాట్లాడినట్లు తెలిపారు. ఈ సందర్భంలో కూలీలు తమ పిల్లలకు సంబంధించి అపార్ జనరేషన్ కోసం ఎదురవుతున్న ఇబ్బందులు తన దృష్టికి తెచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. అపార్‌కు అవసరమైన ఆధార అప్డేషన్ కోసం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారని మంత్రి లోకేశ్‌కు పయ్యావుల వివరించారు. బెళుగుప్ప నుంచి కళ్యాణదుర్గానికి వెళ్లి రావడానికి చార్జీలు, ఫీజులు, నోటరీ చేయించేందుకు రూ. 800 నుంచి 1000లు అడుగుతున్నారని, ఆధార్ సర్వీస్ సెంటర్లలో డబ్బులు చెల్లించేందుకు దాదాపు రూ.2 వేల నుంచి రూ.3 వేలు ఖర్చవుతోందని తనతో కూలీలు ఆవేదన వ్యక్తం చేసినట్లు లోకేశ్‌కు వివరించారు. 35 శాతం మంది విద్యార్థులు పేరు మార్పులు, పుట్టిన తేదీలు, తదితర వివరాలు మార్పు చేసుకునేందుకు నోటరైజ్ అఫిడవిట్ అడుగుతున్నారని తెలిపారు. సాధారణ కూలీలు, దిగువ, మధ్య తరగతి ప్రజలు తమ పిల్లల అధార్ అప్డేషన్ కోసం ఇబ్బందులు పడుతు న్నారని ఆయన నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆధార్ అప్డేషన్‌లో ఎదురవుతున్న ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చినట్లు మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు.



రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో మంత్రి పయ్యావుల కేశవ్

ఉపాధి కోర్సులపై ఉచిత శిక్షణ

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధిని కల్పించే కోర్సులపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఆర్ట్స్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. సంభవ్ ఫౌండేషన్, కియ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, ఐటీఐ అర్హతగల విద్యార్థులకు డేటా ఎంట్రీ ఆపరేటర్, అకౌంట్ ఎగ్జిక్యూటివ్, సర్వీస్ టెక్నీషియన్, డిగ్రీ బీకామ్, బీటెక్, ఐటీఐ కోపా విద్యార్థులకు డేటా అనాలసిస్ కోర్సులపై శిక్షణ ఇస్తారని తెలిపారు. వివరాలకు 7981989190, 9618488031 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

లింగ వివక్షలేని సమాజ స్థాపనకు కృషి

డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి



లింగవివక్షపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీలో మంగళవారం డీఆర్‌డీఏ-వెలుగు, ఐసీడీఎస్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీలు మాట్లాడుతూ లింగ వివక్ష హింసకు వ్యతిరేకంగా కలికట్టుగా పనిచేసి, ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆడ, మగ ఇద్దరూ సమానమేనని, ఎటువంటి వివక్ష లేని సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 18సంవత్సరాలు వయసు వచ్చే వరకు బాలికలకు వివాహం చేయరాదని, సొంతకాళ్లపై నిలబడేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీడాప్ జేడీఎం సూర్యనారాయణ, ట్రైనర్లు ప్రతాప్‌రెడ్డి, నారాయణస్వామి, మునీంద్ర, సాయికిరణ్, మధుసూదన్, ఐసీడీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.



అరటిగెల

అరటి సాగు అదుర్స్!

కూడేరు మండలంలో పెరిగిన సాగు విస్తీర్ణం

అన్నదాతల జాగ్రత్తలతో అధిక దిగుబడులు పండిన పంట విదేశాలకు ఎగుమతి



కూడేరు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో పండిస్తున్న ఉద్యాన పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఇక్కడ సారవంతమైన ఎర్రనేలలు ఉండటంతో పంటల దిగుబడి కూడా బాగా వస్తోంది. మండలంలో చీనీ, మామిడితోపాటు అరటి పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఇక్కడ పండించిన పంటలను ముఖ్యంగా అరటిని ప్రపంచ దేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ముఖ్యంగా అరటి పంట మండలంలో చెప్పుకోదగ్గ స్థాయిలో సాగవుతోంది. ఈక్రమంలోనే అరటి సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. హెక్టారుకు మొదట పంట సాగుకు రూ.30 వేలు, రెండో పంటకు రూ. 10వేలు అందిస్తోంది.



అరటి తోట

పెరిగిన సాగు

ఇటీవలి కాలంలో కూడేరు మండలంలో అరటి సాగు ఊపందుకుంది. కూడేరుతోపాటు రామచంద్రపురం, కడదరకుంట, చోళసముద్రం, జయపురం, ఎంఎంహళ్లి తదితర గ్రామాల్లో దాదాపు 150 ఎకరాల వరకు అరటి సాగు చేశారు. సాధారణంగా రైతులు కేఎఫ్, ఏసీ, మైక్రోసస్, జైయిన్ తదితర రకాల అరటి పిలకలను బెంగళూరు, హైదరాబాద్, మైసూర్ తదితర ప్రాంతాల నుంచి వ్యాపారుల ద్వారా తెప్పించుకుని, సాగు చేస్తారు. ఎకరాకు 1450 మొక్కలు నాటుతారని, ఒక్కొక్క మొక్క రూ.15 నుంచి రూ.20తో కొనుగోలు చేస్తారు. అరటి పంట సాగు ప్రారంభం నుంచి చివరి వరకు ఎకరాకు దాదాపు లక్షన్నర వరకు పెట్టుబడి వస్తుంది. దిగుబడి ఆశాజనంగా ఉంటే ఎకరాకు దాదాపు 20 నుంచి 25 టన్నుల వరకు దిగుబడి వస్తుందని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం ధర టన్ను రూ.13 వేల నుంచి రూ.18 వేల వరకు ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు.

ఇక్కడి పంట విదేశాలకు..

మండలంలో పండించిన అరటి పంటను ఇరాక్, ఇరాన్ వంటి ఇతర దేశాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు. అరటి తోట వద్దే వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు పంటను కొనుగోలు చేస్తున్నారు. కోతల అనంతరం వివిధ మార్గాల ద్వారా విదేశాలకు, దేశంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. పంట సాగు చేసినప్పటి నుంచి కోత వరకు అన్నదాతలు తీసుకుంటున్న జాగ్రత్తల వల్ల పంట దిగుబడి బాగా వస్తున్నట్లు రైతులు తెలిపారు.

ఎంబీఏ చదివి... అరటి సాగులో రాణించి..

రామచంద్రపురం గ్రామానికి చెందిన యువకుడు బళ్లారి వెంకటేష్ ఎంబీఏ చదివి ఉద్యోగ ప్రయత్నాలు చేయకుండా వ్యవసాయంపై మక్కువతో అరటి సాగు చేశాడు. తనకున్న ఆరెకరాల పొలంలో అరటి సాగుచేశాడు. ఇందుకు రూ. ఆరున్నర లక్షలు పెట్టుబడి పెట్టినట్లు తెలిపాడు. కేఎఫ్ రకం మొక్కలను బెంగళూరు నుంచి వ్యాపారులతో కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. ఒక్కో మొక్కను రూ.14తో కొనుగోలు చేసి, ఏడు వేల మొక్కలను నాటినట్లు పేర్కొన్నారు. మొదటి పంట 11 నెలలకు వచ్చింది. దిగుబడి ఆశాజనంగా రావడంతో దాదాపు 135 టన్నుల పండింది. మార్కెట్‌లో టన్ను రూ.13వేల నుంచి రూ.15 వేల వరకు అమ్ముడుపోవడంతో దాదాపు 17లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు రైతు బళ్లారి వెంకటేష్ తెలిపారు. మొదటి కోత పూర్తయిన 9 నెలల తర్వాత రెండో కోత కూడా ప్రస్తుతం సిద్ధంగా ఉందని వివరించారు.



అరటి గెలను చూపుతున్న రైతు బళ్లారి వెంకటేష్

సస్యరక్షణతో అధిక దిగుబడి

అరటి పంటలో సస్య రక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చు. వాతావరణంలో మార్పుల వల్ల పంటకు తెగుళ్లు సోకుతాయి. వాటి నివారణకు రసాయన మందులను ఎప్పటికప్పుడు పిచికారీ చేసుకోవాలి. అప్పుడే అరటికాయలు నాణ్యతగా ఉంటాయి. అరటి పంటకు గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉంటే సిగటోక మచ్చ తెగుళ్లు సోకుతుంది. వీటి నివారణకు కార్బెండిజమ్ ఒక గ్రామును ఒక లీటర్ నీటిలో కలుపుకొని పిచికారీ చేయాలి. తెగుళ్ల తీవ్రంగా ఉంటే ప్రాపికోనజోల్, మినరల్ ఆయిల్ ఒక లీటర్ నీటికి 2 ఎంఎల్ కలిపి పిచికారి చేయాలి. అలాగే పంటకు బ్యాక్టీరియా సాఫ్ట్‌రాట్ మార్చి నెలలో అధికంగా వస్తుంది. వాటి నివారణకు బ్లీచింగ్ పౌడర్ 50 గ్రాములు చెట్టు మొదలు దగ్గర వేయాలి.



-నెట్టికంటయ్య, ఉద్యాన శాఖాధికారి

నాలుగు ప్రాజెక్టుల అమలుకు చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి) జిల్లాలో ఉన్న ఉపరితల నీటి (సర్ఫేస్ వాటర్) ద్వారా మరో 4 ప్రాజెక్టులు అమలు చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్ తెలిపారు. కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం ఆ ప్రాజెక్టులకు సంబంధించి పలు విషయాలను ఆయన వెల్లడించారు. జిల్లాలో ఉన్న ఉపరితల నీటి వనరులను వినియోగించుకొని రూ.480 కోట్లతో 4 మండలాల్లో నాలుగు ప్రాజెక్టుల అమలుకు అనుమతి కోసం ప్రభుత్వానికి వినతి పంపామన్నారు. అనుమతి వచ్చిన వెంటనే చర్యలు చేపడతామన్నారు. శింగనమల మండలంలోని 4 గ్రామాలు, గుంతకల్లు మండలంలోని మరో 3 గ్రామాలు, ఉరవకొండ, రాప్తాడు మండలాల్లోని పలు గ్రామాల్లో ఈ ప్రాజెక్టులు అమలు చేస్తామన్నారు. వీటి కోసం పీఏబీఆర్‌తో పాటు మిడ్‌పెన్నార్‌లో ఉన్న సర్ఫేస్ వాటర్‌ను పైప్‌లైన్ ద్వారా అందజేస్తామన్నారు.

తల్లీబిడ్డ మృతిపై విచారణకు త్రిసభ్య కమిటీ

అనంతపురంటౌన్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో సోమవారం జరిగిన తల్లీబిడ్డ మృతిపై వాస్తవాలు తెలుసుకునేందుకు త్రిసభ్య కమిటీని నియమించినట్లు సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు తెలిపారు. రాయదుర్గం పట్టణానికి చెందిన సరళజ్యోతితో పాటు పుట్టినబిడ్డ మృతి చెందారు. ఇందుకు డాక్టర్ల నిర్లక్ష్యంమే కారణమనే విమర్శలు వచ్చాయి. ఈనేపథ్యంలో సీనియర్ వైద్యులు, సర్జన్ విభాగాధిపతి డాక్టరు రామస్వామి నాయక్, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టరు రవికుమార్, అనస్తీషియా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టరు జగదీసాచార్యులను విచారణకు నియమించినట్లు తెలిపారు. ఈకమిటీ పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదిక ఇస్తుందని అందులో డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యం ఉందని తేలితే చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ తెలిపారు.

రేపు ప్రాంగణ నియామకాలు

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ యూనిర్సిటీలో గురువా రం ప్రాంగణ నియామకాలు చేపడుతున్నట్లు వీసీ ఎస్ఏ కోరి మంగళవారం తెలిపారు. మానవ వనరుల నిర్వహణ, మూలధనం వంటి రంగాల్లో సేవలందిస్తున్న ఏడీపీ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీలో కనీసం 60శాతం మార్కులు సాధించిన ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులందరూ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. జంతులూరులోని సెంట్రల్ యూనివర్సిటీలో నిర్వహించే ఇంటర్వ్యూలకు ఆసక్తిల విద్యార్థులు హాజరుకావాలని కోరారు. వివరాలకు 9491490338 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

రబీ ఈ-పంట నమోదు ఆరంభం

అనంతపురం అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీ సీజన్‌కు సంబంధించి ఈ పంట నమోదు మంగళవారం ఆరంభమైంది. గత నెలాఖరులో వ్యవసాయ శాఖ సిబ్బందికి యాప్‌లో ఈ పంట నమోదు చేయడంపై శిక్షణ ఇచ్చారు. ఈ పంట నమోదుకు 3.1 వర్షన్ యాప్ అప్లికేషన్‌ను ఇచ్చారు. ఈ పంట నమోదుతోపాటు రైతుల బయోమెట్రిక్‌ను పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ ఏడాది రబీ లో పప్పుశనగ 72909 హెక్టార్లు, వరి 6928, జొన్న 4735, మొక్కజొన్న 7844 హెక్టార్ల సాగు లక్ష్యంగా నిర్ణయించారు. మిగతా విస్తీర్ణంలో ఉలవలు, పెసలు, అలసంద తదితర పంటలున్నాయి. ఇప్పటిదాకా జిల్లా వ్యాప్తంగా 71996 హెక్టార్లల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో 57970 హెక్టార్లల్లో పప్పుశనగ పంట సాగైంది.

తొలిరోజు 3వేల ఎకరాల్లో...

జిల్లాలో తొలి రోజు మంగళవారం మూడు వేల ఎకరాల్లో ఈ పంట నమోదుచేశారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 20లోగా ఈ పంట నమోదుతోపాటు రైతులతో బయోమెట్రిక్ వేలిముద్ర వేయించాలని ఆదేశించారు. ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు సామాజిక తనిఖీ కోసం రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించి, గ్రామసభలు ఏర్పాటు చేస్తారు. ఫిబ్రవరి 6 నుంచి 10 దాకా రైతుల నుంచి అభ్యంతరాలు, ఫిర్యాదు స్వీకరిస్తారు. ఫిబ్రవరి 15న తుది ముసాయిదా జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారు. క్షేత్ర స్థాయిలో వ్యవసాయ సిబ్బందికి రైతులు సహకరించి సకాలంలో ఈ పంట నమోదు పూర్తి అయ్యేందుకు సహకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ కోరారు.

హంద్రీనీవాకు కళ!

రూ. 936.70 కోట్లతో ప్రధాన కాలువ లైనింగ్ పనులు
నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ

అనంతపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన హంద్రీ నీవా ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వంలో ఆదరణ లభిస్తోంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు... ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఉమ్మడి జిల్లా కొచ్చిన సందర్భాల్లోనూ హంద్రీనీవా పెండింగ్ పనులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆమేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులకు ఆమోద ముద్ర వేశారు. ఆ మేరకు రూ. 936.70 కోట్లతో హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నిధులు మంజూరు చేస్తూ జీవో నెం 405 మంగళవారం జారీ చేశారు. దీంతో హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులు ఇక నుంచి వేగంగా జరగనున్నాయి.

జీడిపల్లి నుంచి...

హంద్రీనీవా ప్రాజెక్టు ఫేజ్-2లో భాగంగా జీడిపల్లి జలాశయం దగ్గర నుంచి అంటే 216.300 కి.మీ నుంచి 230 కి.మీ వరకూ రూ. 58.30 కోట్ల ఖర్చుతో లైనింగ్ పనులు చేపట్టనున్నారు. 230 కి.మీ నుంచి 245 కి.మీ వరకూ రూ. 65.60 కోట్లు, 245 కి.మీ నుంచి 260 కి.మీ వరకూ రూ. 74.30 కోట్లు, 260 కి.మీ నుంచి 280 కి.మీ వరకూ రూ. 64.20 కోట్లు, 280 కి.మీ నుంచి 300 కి.మీ వరకూ శ్రీసత్యసాయి జిల్లాలోని హంద్రీనీవా ప్రధాన కాలువ లైనింగ్ పనులకు రూ. 57.80 కోట్లు, 285.100 కి.మీ నుంచి 287.100 కి.మీ టన్నెల్ ఏర్పాటు కోసం రూ. 36.19 కోట్లు, 300 కి.మీ నుంచి 320 కి.మీ వరకూ పెండింగ్‌లో ఉన్న పనులకు(చెన్నేకొత్తపల్లి మండలంలో) రూ. 103.32 కోట్లు, 320 కి.మీ నుంచి 340 కి.మీ వరకూ శ్రీసత్యసాయి జిల్లాలో రూ.61.04 కోట్లు, 340 కి.మీ నుంచి 358 కి.మీ వరకూ పెండింగ్ పనులతో పాటు ప్రధాన కాలువ ఆధునికీకరణ కోసం రూ. 119.35 కోట్ల నిధులు మంజూరు చేశారు. అదే విధంగా 358.150 కి.మీ నుంచి 360.250 కి.మీ వరకూ టన్నెల్ పెండింగ్ పనులు, ఇతరత్ర నిర్మాణాలు(బుక్కపట్నం మండలం పరిధిలో) కోసం రూ. 55.40 కోట్లు, 360.400 కి.మీ నుంచి 380.150 కి.మీ వరకూ(బుక్కపట్నం మండల పరిధిలో) పెండింగ్ పనుల పూర్తికి రూ. 161.60 కోట్లు, 380 కి.మీ నుంచి 400 కి.మీ వరకూ(ముదిగుబ్బ మండల పరిధిలో) పెండింగ్ పనుల పూర్తికి రూ. 79.60 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ పనులు పూర్తి చేయడానికి ప్రభుత్వం పరిపాలన అనుమతులు సంబంధిత శాఖాధికారులకు మంజూరు చేసింది.

వెడల్పు చేయకుండా లైనింగ్ పనులా..?

జిల్లాకు తీవ్ర నష్టం
సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



అనంతపురం కల్చరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ వెడల్పు చేయకుండా లైనింగ్ పనులు చేస్తే జిల్లాకు తీవ్ర నష్టం కలుగుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన జీఓ నెం.405 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి విరుద్ధంగా ఉందని విమర్శించారు. పదివేల క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువ వెడల్పు చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు ప్రస్తుతం అందుకు విరుద్ధంగా జీఓ ఇవ్వడం సరికాదన్నారు. ఈ ఏడాది శ్రీశైలం ప్రాజెక్టు పొంగి పొర్లినా జిల్లాలోని చెరువులు నింపలేకపోవడానికి ప్రధాన కారణం కాలువ సామర్థ్యం తక్కువగా ఉండటమే నన్నారు. నాలుగు రోజుల కిందట జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం జిల్లాను అభివృద్ధి చేస్తామని చెప్పి, ఇపుడు ఇలా కేవలం లైనింగ్ పనులకు మాత్ర మే నిర్ణయించడం దారుణమని విమర్శించారు. హంద్రీనీవా ప్రారంభమయ్యే కర్నూలు జిల్లాలో లైనింగ్ చేయకుండా అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో మాత్రమే ఎందుకు చేస్తున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రూ.936.70కోట్ల లైనింగ్ పనులను 12 ప్యాకేజీల కింద విభజించడం ద్వారా జిల్లా రైతులకంటే కాంట్రాక్టర్లే ఎక్కువ లాభపడతారన్నారు. ఇరిగేషన్ శాఖకు కేటాయించిన నిధుల నుంచే ఈ కాలువ లైనింగ్ చేపడతామని జీఓలో పేర్కొనడం అనేక అనుమానాలకు తావిస్తోందని తెలిపారు.

నేడు పాలిటెక్ ఫెస్ట్

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో బుధవారం రీజనల్ పాలిటెక్‌ఫెస్ట్-2024ను నిర్వహిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్య ప్రతిభాపాటవాలను గుర్తించి, వారిని ప్రోత్సహించేలా టెక్‌ఫెస్ట్-2024ను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారని పేర్కొన్నారు. కళాశాలలో నిర్వహించే ఫెస్ట్‌లో ఉమ్మడి జిల్లాలోని 17 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు వారి ప్రాజెక్టులను ప్రదర్శిస్తారని తెలిపారు. ఉత్తమ ప్రాజెక్టులను ఎంపికచేసి రాష్ట్రస్థాయి ప్రదర్శనా పోటీలకు పంపుతామన్నారు. రెండురోజులపాటు నిర్వహించే ఫెస్ట్‌కు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రత్యేక అతిథిగా హాజరవుతారని తెలిపారు.

అనంతలో మానవహక్కుల వేదిక రాష్ట్ర మహాసభలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించి జిల్లాలో ఈనెల 14, 15వ తేదీల్లో మానవ హక్కుల వేదిక 10వ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఆ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యూజి శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో సభలు నిర్వహిస్తామన్నారు. కులగణన ఎందుకు అవసరం అనే అంశంపై సామాజిక విశ్లేషకుడు ఎస్ఏన్ సాహు, బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు అనే అంశంపై స్వతంత్ర విలేకరి మాలిని సుబ్రహ్మణ్యం, కాషాయీకరణ, కార్పొరేటీకరణ అనే అంశాలపై చరిత్ర విశ్రాంత అధ్యాపకుడు కొప్పర్తి వెంకటరమణమూర్తి ప్రసంగిస్తారన్నారు. అన్నివర్గాల ప్రముఖులు, ప్రజలు మహాసభల్లో విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎవరి మేలు కోసం..?

జిల్లాకు రెండేళ్ల కిందట 195 గోడౌన్ల మంజూరు

93 పూర్తి..
రూ.51 కోట్ల బిల్లుల చెల్లింపు
సహకారశాఖకు అప్పగించని మార్కెటింగ్ శాఖ
అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం
సొసైటీలపై మోయలేని వడ్డీ భారం
చక్రం తిప్పిన డెప్యుటేషన్ ఉద్యోగి



బుక్కరాయ సముద్రంలోని గోడౌన్

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సొసైటీలకు ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు నిర్మించిన గోడౌన్లను సహకార శాఖకు స్వాధీనం చేయకుండా మార్కెటింగ్ శాఖ ఇంజనీర్లు నిర్లక్ష్యం చేస్తున్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లాకు కేంద్ర ప్రభుత్వం 195 గోడౌన్లను మంజూరు చేసింది. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం నిధులు చెల్లించకుండా భారాన్ని ఆప్కాబ్, సొసైటీలపైనే మోపింది. దీంతో ఆప్కాబ్, ఏడీసీసీ బ్యాంకు, సొసైటీలు నాబార్డు నుంచి రుణాలు తీసుకుని గోడౌన్ల నిర్మాణాన్ని ప్రారంభించారు. మూడేళ్లలో 93 గోడౌన్లను మాత్రమే పూర్తి చేశారు. వీటిని సహకార శాఖకు అప్పగించకుండా మార్కెటింగ్ శాఖ ఇంజనీర్లు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇప్పటి వరకు చెల్లించిన రూ.51కోట్ల బిల్లుల రుణాలకు సంబంధించి సొసైటీల నుంచి వడ్డీ వసూలు చేస్తున్నారు. ఎటువంటి ఆదాయం (అద్దెల ద్వారా వచ్చే ఆదాయం) లేకనే వడ్డీ భారం సొసైటీలపై పడుతోంది.

బిల్లుల ఆమోదంలో ఆప్కాబ్ అధికారి పాత్ర కీలకం

గోడౌన్ల నిర్మాణం, బిల్లుల ఆమోదంలో ఓ ఆప్కాబ్ అధికారి కీలకంగా వ్యవహరించారు. ఆప్కాబ్ ఉద్యోగి గోడౌన్ల నిర్మాణం పేరుతో ఏడీసీసీ బ్యాంకుకు డెప్యుటేషన్‌పై వచ్చారు. విజయవాడలో ఉండాల్సిన ఆయన జిల్లాలోనే ఉంటూ చక్రం తిప్పుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో తన పలుకుబడితో ఇక్కడికి వచ్చిన ఆ ఆప్కాబ్ అధికారి మూడేళ్ల డెప్యుటేషన్ గడువు ముగిసినా ఇక్కడే ఉంటున్నారు. గోడౌన్ల నిర్మాణానికి సంబంధించి వైసీపీ సానుభూతిపరులైన కాంట్రాక్టర్లకు మేలు చేసేందుకే ఆయన డెప్యుటేషన్‌పై ఉంటూ బిల్లులు చెల్లిస్తూ ముడుపులు పుచ్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గోడౌన్లకు సంబంధించి కాంట్రాక్టర్లకు ఇప్పటి వరకు రూ.51కోట్లు చెల్లించారు. సాధారణంగా గోడౌన్ల నిర్మాణం పూర్తి అయిన తరువాత క్షేత్ర స్థాయిలో సహకార శాఖ, మార్కెటింగ్, ఏడీసీసీ బ్యాంకు, సొసైటీ అధికారుల బృందం పర్యవేక్షణ చేసిన అనంతరం బిల్లులు చెల్లించాలి. కానీ అవేవీ పట్టించుకోకుండా బిల్లులు చెల్లించేశారు. అయితే వీటిని వినియోగంలోకి తేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. జిల్లా కేంద్రానికి అతి సమీపంలోని బుక్కరాయసముద్రంలో నిర్మించిన గోడౌన్‌లో మందుబాబులు సకలం అక్కడే కానిచ్చేస్తున్నా పట్టించుకునేవారే లేరు.

మార్కెటింగ్ శాఖ ఇంజనీర్ల నిర్లక్ష్యం

ఉమ్మడి జిల్లాలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో 195గోడౌన్ల నిర్మాణానికి కేంద్రప్రభుత్వం అనుమతిచ్చింది. వీటిలో అనంతపురం జిల్లాలో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్లు 18, 500మెట్రిక్‌టన్నుల సామర్థ్యంతో 84 గోడౌన్ల నిర్మాణం చేపట్టారు. శ్రీతస్యసాయి జిల్లాలో వెయ్యి మెట్రిక్‌టన్నులకు సంబంధించి 21, 500మెట్రిక్ టన్నులకు సంబంధించి 72 మొత్తంగా 93 గోడౌన్లను నిర్మించాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు అనంతపురం జిల్లాలో 54, శ్రీసత్యసాయి జిల్లాలో 49గోడౌన్ల నిర్మాణం పూర్తి చేశారు. వెయ్యి మెట్రిక్‌టన్నుల గోడౌన్‌కు రూ.85లక్షలు, 500మెట్రిక్ టన్నుల గోడౌన్లకు రూ.45లక్షల నిధులు కేటాయించారు. నిర్మాణం పూర్తి చేసి ఏడాది కావస్తున్నా వీటిని సహకార శాఖకు స్వాధీనం చేయడంలో మార్కెటింగ్ శాఖ ఇంజనీర్లు నిర్లక్ష్యం చేస్తూ వస్తున్నారు.

సొసైటీలపై మోయలేని ఆర్థికభారం

గోడౌన్ల నిర్మాణం సొసైటీలకు ఆర్థిక భారం కలిగిస్తోంది. గోడౌన్ల నిర్మాణం పూర్తయిన వెంటనే ఉపయోగంలోకి వస్తే వాటి ద్వారా వచ్చే ఆదాయంతో సొసైటీలకు వెసులుబాటు కలిగేది. నాబార్డు ద్వారా ఆప్కాబ్‌కు, ఆప్కాబ్‌ద్వారా ఏడీసీసీ బ్యాంకుకు, ఏడీసీసీ బ్యాంకు నుంచి సొసైటీలకు రుణాలు చెల్లిస్తారు. సొసైటీలు తీసుకున్న రుణాలకు 4శాతం వడ్డీతో కలిపి తిరిగి బ్యాంకుకు చెల్లించాల్సి ఉంటుంది. బ్యాంకు అప్పు ఇచ్చిన నాటి నుంచే వడ్డీ కట్టించుకుంటారు. అయితే గోడౌన్లు వినియోగంలోకి రాకపోవడంతో ఆదాయం లేక వడ్డీ భారం సొసైటీలపై తీవ్రంగా పడుతోంది.



మార్కెటింగ్ శాఖ ఇంజనీరుకు లేఖ పంపాం



నిర్మించిన గోడౌన్‌లను స్వాధీనం చేయాలని పలు మార్లు మార్కెటింగ్ శాఖ ఇంజనీరుకు లేఖ రాశాం. అయితే ఇప్పటి వరకు ఒక్కటి కూడా మా ఆధీనంలో కి రాలేదు. పూర్తి అయిన వాటికి బిల్లులు కూడా చెల్లించారు. స్వాధీనం చేయడంలో కాలయాపన చేస్తున్నారు. స్వాధీనం చేసిన అనంతరం ప్రారంభోత్సవం చేస్తాం. బిల్లుల చెల్లింపులన్నీ ఆప్కాబ్, మార్కెటింగ్ శాఖద్వారానే జరుగుతున్నాయి. ఇందులో మా ప్రమేయం ఏమీ ఉండదు. సొసైటీల నుంచి రికవరీ చేయాల్సి ఉంటుంది.

- అరుణకుమారి, జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)

న్యూస్‌బాక్స్

పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

15లోగా ప్రీమియం చెల్లించాలి

జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈనెల 15లోగా పప్పుశనగ, వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, టమోటా పంటలకు పంటల బీమా వర్తింపజేసేందుకు ప్రీమియం చెల్లించాలన్నారు. డిసెంబరు 31లోగా వరి పంటకు ప్రీమియం చెల్లించాలన్నారు. తుఫాన్, కరువు, అకాల వర్షం తదితర ప్రకృతి వైపరీత్యాల మూలంగా పంట దిగుబడి నష్టపోతే ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దిగుబడి ఆధారిత బీమాకు సంబంధించి పప్పుశనగ ఎకరాకు రూ.450లు, వేరుశనగ పంటకు ఎకరాకు రూ.480లు, జొన్నకు ఎకరాకు రూ.315లు, మొక్కజొన్నకు రూ.525లు, వరి పంటకు ఎకరాకు రూ.630లు ప్రీమియం చెల్లించాలన్నారు. వాతావరణ ఆధారిత బీమాకు సంబంధించి టమోటా పంటకు ఎకరాకు రూ.1650లు చెల్లించాలన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన వర్తించేందుకు ఫ్యూచర్ జనరాలి ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, వాతావరణ ఆధారిత పంటల బీమా కోసం అగ్రికల్చర్ అస్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు ప్రీమియం చెల్లించాలన్నారు. ఆయా పంటలకు బ్యాంక్‌లో రుణం తీసుకునే రైతులు బ్యాంక్‌లోనే ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. రుణం తీసుకోని రైతులు కామన్ సర్వీస్ సెంటర్లు, పీఏసీఎస్, పోస్టాఫీస్, సచివాలయాల్లో ఎన్‌సీఐపీ నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ లేదా వెబ్‌సైట్ మొబైల్ ద్వారా ప్రీమియం చెల్లించవచ్చునన్నారు. ఆధార్, భూమి లేదా కౌలు కార్డు, రైతు సేవా కేంద్రం ద్వారా సిబ్బందితో పొందిన పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రం, బ్యాంక్ పుస్తకం జిరాక్స్, ఫోన్ నంబర్ సమర్పించి ఆన్‌లైన్ ద్వారా ప్రీమియం చెల్లించాలని సూచించారు.

టమోటా కిలో రూ.49

అనంతపురం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 49తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 42, కనిష్ఠ ధర రూ. 33 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.26 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 26,690 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 10వేలు, సరాసరి రూ. 20,400తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 21 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నీటి నిల్వ 1.681 టీఎంసీలు

బెళుగుప్ప, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 958 క్యూసెక్కులు ఉండగా ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ 2కు 768 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నిలు రెండోసారీ వాయిదా పడ్డాయి. మొదట అక్టోబరు 16 నుంచి నవంబరు 24లోపు ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తరువాత ఈ నెల 5 నుంచి 8లోపు సాగునీటి సంఘాల ఎన్నికలు పూర్తి చేయాలని కొత్త షెడ్యూల్ విడుదల చేశారు. అయితే రాష్ట్రంలో నెలకొ న్న తుఫాన్, వరదల కారణంగా రెండోసారి వాయిదా వేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్చెల్సీ పరిధిలో 99, మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95 మొత్తం 194సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వ హణకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. తదుపరి ఎన్నికల తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఉమ్మడి జిల్లా జలవనరుల శాఖ ప్రాజెక్టుల సీఈ నాగరాజ తెలిపారు.

బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ సీనియర్ పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేశారు. ఎంపికైన జట్ల వివరాలను జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హబీబుల్లా, నరేంద్రచౌదరి మంగళవారం స్థానిక అశోక్‌నగర్ డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు 6 నుంచి 9 వరకు పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు.

జట్ల వివరాలు

మహిళా జట్టు: సోహనా, యశశ్విని, మేఘన, వైష్ణవి, పరిమళ, దేదీప్య సాయి, సాయిజ్యోతిక, హిమవర్షిత, పల్లవి, నందిని, కిరణ్మయి, నిక్కశ్రీ.

పురుషుల జట్టు: సాదిక్, సతీష్, సత్యప్రకాష్, ద్వారకా, నరసింహులు, సంజయ్, బాషా, సిద్దు, నయాన్‌బాషా, వివేక్, కృష్ణా రెడ్డి, సంతోష్, వాసన్‌రామ్.

ఆగని కర్ణాటక మద్యం

బెల్టుషాపుల చాటున విక్రయాలు

దాడులు చేస్తున్నా బెదరని వైనం

నాయకుల కనుసన్నల్లోనే సరఫరా

చోద్యంచూస్తున్న ఉన్నతాధికారులు



పాలసముద్రంలో పట్టుబడిన కర్ణాటక మద్యం (ఫైల్)

హిందూపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటుతున్నా ఇప్పటికీ కర్ణాటక మద్యం జిల్లాలో ఏరులై పారుతోంది. గత వైసీపీ హయాంలో కర్ణాటక నుంచి మద్యం అక్రమంగా తీసుకొచ్చి విక్రయించిన వారే.. ప్రస్తుతం కూడా దర్జాగా తెస్తూ విక్రయాలు సాగిస్తున్నారు. యథేచ్ఛగా దందా సాగుతున్నా అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తూతూమంత్రంగా దాడులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సాధారణంగా సరిహద్దు గ్రామాల్లో కర్ణాటక మద్యం తెస్తుంటారు. జిల్లావ్యాప్తంగా సరఫరా అవుతోందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ అక్రమ రవాణాలో కూటమి నాయకుల హస్తం పుష్కలంగా ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఇటీవల పట్టుబడుతున్న దాఖలాలే నిదర్శనాలు. కొన్నిచోట్ల అధికారులు దాడులు చేస్తున్నా అక్రమంగా మద్యాన్ని తీసుకొచ్చే వారు బెదరట్లేదు. కర్ణాటక నుంచి దర్జాగా మద్యం తీసుకొస్తూ రూ.లక్షలు వెనకేసుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బెల్టుషాపు చాటున విక్రయాలు

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రాష్ట్రంలో నూతన ఎక్సైజ్ విధానాన్ని తీసుకొచ్చారు. ఆ మేరకు మద్యం షాపులను లైసెన్స్‌దారులు నిర్వహిస్తున్నారు. నిబంధనలు తుంగలోతొక్కి, జిల్లావ్యాప్తంగా బెల్టుషాపులు ఏర్పాటు చేసుకుని, విక్రయాలు సాగిస్తున్నారు. గతంకంటే ప్రస్తుతం బెల్టుషాపులు ఎక్కువగానే ఉన్నాయని చెప్పవచ్చు. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు, మండలాలు, పల్లెల్లో నిర్వహిస్తున్నారన్నది బహిరంగ రహస్యమే. బెల్టుషాపులు నిర్వహించే కొంతమంది ఏపీ మద్యం అమ్మితే వచ్చే లాభం కొంతేనంటూ కర్ణాటక మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని తెలుస్తోంది. ఏపీ మద్యం ఒక కేసు తీసుకెళ్తే కర్ణాటక సరుకు మూడు కేసులు తెచ్చుకుంటున్నట్లు సమాచారం. సరిహద్దు కర్ణాటకలోని మద్యం షాపుల్లో వ్యాపారాలు తగ్గకపోవడమే ఇందుకు నిదర్శనం. గతంలోకంటే ఇప్పుడే కొంత మేర పెరిగినట్లు సమాచారం. ఆ మద్యమంతా జిల్లాలోకి వస్తున్నట్లు ఇక్కడ షాపులు నిర్వహించే లైసెన్స్‌దారులే పేర్కొనడం గమనార్హం.

దాడులు చేస్తున్నా...

అధికారులు దాడులు చేస్తున్నా అక్రమంగా మద్యం తీసుకొచ్చేవారు మాత్రం బెదరట్లేదు. వారి వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతోంది. ఇటీవల హిందూపురం, పెనుకొండ, మడకశిరలో ఎక్సైజ్ అధికారులు వరుస దాడులు చేస్తున్నారు. ఈ దాడుల్లో భారీ ఎత్తున కర్ణాటక మద్యం పట్టుబడుతోంది. అయినా కర్ణాటక నుంచి మద్యం తెచ్చేవారు బెదరడం లేదు. ఇటీవల ఎక్సైజ్ పోలీసులకు కర్ణాటక నుంచి మద్యం తెచ్చే వ్యక్తి పట్టుబడ్డాడు. అతను గతంలో కూడా పలుసార్లు ఎక్సైజ్ అధికారులకు చిక్కాడు. వదిలేసిన మరుసటి రోజే కర్ణాటక మద్యాన్ని దర్జాగా తీసుకొచ్చి, విక్రయాలు సాగించాడు. దీనిని బట్టి కర్ణాటక మద్యం వ్యాపారంలో ఎంత లాభం ఉందో అర్థం అవుతుంది. అక్కడ ఓ టెట్రా ప్యాకెట్ రూ.60నుంచి రూ.70కు కొనుగోలు చేస్తే ఇక్కడ రూ.120 నుంచి రూ.130కు విక్రయిస్తారు. ఒక కేసులో 48 టెట్రాప్యాకెట్లు ఉంటాయి. ఆ లెక్కన చూస్తే ఓ బాక్సుపై రూ.2వేల దాకా ఆదాయం ఉంటుంది. ఖర్చులు పోయినా రూ.1500కు తగ్గదు. రోజుకు 10 నుంచి 20బాక్సులు విక్రయించేవారున్నారు. ఇటీవల పట్టుబడినవారిలో కొంతమంది ఆదాయం నెలకు రూ.2లక్షల నుంచి రూ.3లక్షలదాకా ఉన్నట్లు పోలీసుల సమక్షంలో ఒప్పుకున్నట్లు తెలిసింది. దీంతో సునాయాసంగా డబ్బు వెనకేసుకోవచ్చన్న ఆశతో కర్ణాటక మద్యం వ్యాపారం సాగిస్తున్నారు.

నాయకుల కనుసన్నల్లోనే..

జిల్లాలో కొన్నిచోట్ల కూటమి నాయకుల సహకారంతో కర్ణాటక మద్యం వ్యాపారం సాగుతోందన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. మరికొన్నిచోట్ల వైసీపీ, కూటమి నాయకులు కలిసి చేయిస్తున్నట్లు తెలిసింది. కొన్ని పల్లెల్లో బెల్టుషాపులు నిర్వహించే వారు చోటామోటా నాయకులకు నెలకు రూ.10వేల నుంచి రూ.15వేలదాకా ఇస్తున్నట్లు సమాచారం. ఆదాయం వస్తుందని కొన్నిచోట్ల అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఏకమై సజావుగా సాగిస్తున్నట్లు విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

దాడులు చేస్తున్నాం..

కర్ణాటక మద్యానికి అడ్డుకట్ట వేసేదిశగా నిత్యం దాడులు చేస్తున్నాం. రోజూ ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. కర్ణాటక మద్యం తీసుకొస్తే కఠినంగా వ్యవహరిస్తాం. పదేపదే పట్టుబడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తాం.

-లక్ష్మీదుర్గయ్య, ఎక్సైజ్ సీఐ

ఎన్నిసార్లు తిరగాలి..?

బర్త్ సర్టిఫికెట్ల కోసం రోడ్డెక్కిన దరఖాస్తుదారులు



తాడిపత్రి రోడ్డుపై బైఠాయించిన దరఖాస్తుదారులు

బత్తలపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జనన ధ్రువీకరణ పత్రాల కోసం ఎన్నిసార్లు తిరగాలని దరఖాస్తుదారులు మండిపడ్డారు. సర్టిఫికెట్ల జారీలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మంగళవారం స్థానిక తాడిపత్రి రోడ్డులో బైఠాయించి, నినాదాలు చేశారు. స్థానిక ఆర్డీటీ ఆస్పత్రిలో జన్మించిన వారందరికీ బత్తలపల్లి సచివాలయం1లో జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తారు. జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర ప్రాంతాల వారు కూడా పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా బర్త్ సర్టిఫికెట్లు మాత్రం ఇవ్వట్లేదని దరఖాస్తుదారులు మండిపడ్డారు. విద్యార్థులకు ప్రస్తుతం అపార్ నమోదు చేస్తున్నారనీ, అందుకు తప్పులేని జనన ధ్రువీకరణ పత్రం అవసరమవడంతో రోజూ సచివాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నామన్నారు. అదనపు సిబ్బందిని నియమించి, సమస్య పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగికి దరఖాస్తులు ఇచ్చామనీ, ఒకటో తేదీ నుంచి ఆయనను తొలగించడంతో మళ్లీ ఇవ్వమంటున్నారని వారు వాపోయారు. కూడేరుకు చెందిన ఫరీదా మాట్లాడుతూ.. జనన ధ్రువీకరణ పత్రం కోసం ఐదు నెలలుగా తిప్పుకుంటున్నారని తెలిపారు. 3 నెలలగా తిప్పుకుంటున్నారని నల్లమాడకు చెందిన బయపురెడ్డి వాపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇద్దరు పెళ్లాల ముద్దుల దొంగ..!

ఏడుగురు పిల్లలతో పోషణభారం

దిక్కుతోచక చోరీలకు దిగిన పెయింటర్

ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో 41 కేసులు

మరో ఇద్దరితో కలిపి పట్టుకున్న పోలీసులు

31తులాల బంగారం.. కారు స్వాధీనం





స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, కారు, బైక్

క్రైంకార్నర్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసులు ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి 310 గ్రాముల బంగారు ఆభరణాలు, కారును స్వాధీనం చేసుకున్నారు. దొంగల ముఠా నాయకుడు షేక్ ఖాజా పీరాపై ఏపీ, కర్ణాటక, తెలంగాణలో మొత్తం 41 కేసులు ఉన్నాయి. అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జగదీష్ నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి, కేసుల వివరాలు వెల్లడించారు. వివిధ రాష్ట్రాలలో దొంగతనాలకు పాల్పడుతున్న శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన షేక్ ఖాజాపీరా, మహేష్, జమీర్‌ను అరెస్టు చేశామని తెలిపారు.

జైలుకు వెళ్లొచ్చాక జతగాళ్లు

ముఠా నాయకుడు షేక్ ఖాజాపీరా వృత్తి రీత్యా పెయింటర్. ఇతనికి ఇద్దరు భార్యలు, ఏడుగురు పిల్లలు. పెయింటింగ్ ద్వారా వచ్చే డబ్బు సరిపోకపోవడంతో దొంగతనాలు ప్రారంభించాడు. 2021 నుంచి తాళం వేసిన ఇళ్లకు ఒక్కడే వెళ్లి చోరీలకు పాల్పడేవాడు. అనంతపురం జిల్లా సహా రాష్ట్రంలో 14, కర్ణాటకలోని బాగేపల్లిలో 4, కోలార్ జిల్లాలో 5, తెలంగాణలోని షంషాబాద్‌లో 4 దొంగతనాలు చేశాడు. అప్పట్లో నమోదైన ఈ 27 కేసులలో జైలుకు వెళ్లి.. ఈ ఏడాది మార్చిలో బయటకు వచ్చాడు. ఆ తరువాత కూలి పనులకు వెళ్లే మహేష్, జమీర్‌ను కలుపుకుని దొంగతనాలను తిరిగి ప్రారంభించాడు. అనంతపురం రూరల్, త్రీటౌన్, ఫోర్త్‌టౌన్, యాడికి, ఇటుకలపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో 10 దొంగతనాలు, కర్ణాటకలోని కోలార్ జిల్లాలో 4 దొంగతనాలు చేశారు. వీరు కారును బాడుగకు తీసుకుని వెళ్లి చోరీలకు పాల్పడేవారు. జమీర్ డ్రైవింగ్ చేసేవాడు. తాళం వేసిన ఇళ్లను ఎంపిక చేసుకున్న తరువాత.. మహేష్, జమీర్ బయటే ఉండి ఎవరూ రాకుండా నిఘా ఉంచుతారు. ఖాజా ఒక్కడే ఇంట్లోకి వెళ్లి విలువైన ఆభరణాలను ఎత్తుకొచ్చేవాడు. వీరిపై అనంతపురం సీసీఎస్ పోలీసులు, రూరల్ పోలీసులు నిఘావేసి అరెస్టు చేశారు.

మరో చోరీ కోసం వచ్చి..

అనంతపురం నగర శివారులో మరో చోరీ కోసం ముఠా ప్రయత్నిస్తూ పోలీసుల కంట పడింది. కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఓ కారు అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు వాహనంతో పాటు ఆ ముగ్గురినీ అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వ్యవహారం బయటపడింది. సీసీఎస్ సీఐ ఇస్మాయిల్, రూరల్ సీఐ శేఖర్, ఎస్ఐ రాంబాబు వారిని అరెస్టు చేశారు. వారితోపాటు హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, మల్లికార్జున, చంద్రశేఖర్, గిరిబాబు, జయకర్, కానిస్టేబుళ్లు శివయ్య, పాండవ, ఆంజనేయప్రసాద్, రంజిత్, బాలకృష్ణ, షామీర్, రాజశేఖర్‌ను ఎస్పీ అభినందించారు.

కొత్త సెక్షన్ కింద..

నిందితులపై బీఎన్ఎస్ చట్టం కింద కేసు నమోదు చేశామని ఎస్పీ జగదీష్ తెలిపారు. ఆర్గనైజ్డ్ క్రైం కింద యావజ్జీవ కారాగార శిక్ష పడే సెక్షన్ కింద వీరిని రిమాండ్‌కు పంపుతామని తెలిపారు. దొంగతనం కేసుల్లో ఇదివరకు ఐదేళ్లు, ఏడేళ్ల జైలు శిక్ష పడేదని, ఇప్పుడు శిక్ష మరింత కఠినతరమైందని తెలిపారు. ఊళ్లకు వెళ్లే సమయంలో లాక్ట్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌ను ఉపయోగించుకోవాలని ప్రజలకు ఎస్పీ సూచించారు. పోలీసులకు సమాచారం ఇస్తే.. ఆ ఇంట్లో కెమెరా ఇన్‌సర్ట్ చేస్తారని, ఇంట్లోకి దొంగలు వస్తే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవచ్చని తెలిపారు. అల్మారా, బీరువాలకు తాళం వేయకుండా నిర్లక్ష్యం వహిస్తుంటారని, అలా చేయొద్దని సూచించారు. బంగారు ఆభరణాలను లాకర్లలో పెట్టాలని సూచించారు.

గుర్తు తెలియని వాహనం ఢీ.. యువకుడి మృతి



జయశంకర్ (ఫైల్)

నార్పల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకుంటపల్లి గ్రామ సమీపంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని తలారి జయశంకర్(36) మృతి చెందాడు. గూగూడు గ్రామానికి చెందిన తలారి జయశంకర్ తన ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం రామాపురానికి వెళ్లాడు. అక్కడ పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా మార్గమధ్యలో పుచ్చుకుంట పల్లి గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ అతడిని 108 వాహనంద్వారా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడు గూగూడు కుళ్లాయిస్వామి దేవస్థానంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి భార్య త్రివేణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాగర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


విద్యుదాఘాతానికి యువకుడి బలి



వెంకటేష్ (ఫైల్)

పామిడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నారాయణస్వామివీధి(మార్కెట్)లో విద్యుదాఘాతంతో వెంకటేష్(24) సోమవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన మిద్దె రామాంజనేయులు కుమారుడు వెంకటేష్ స్థానిక నారాయణస్వామి వీధిలో తన స్నేహితులతో కలిసి మాట్లాడుతుండగా వర్షం వచ్చింది. దీ దంతో పక్కనే ఉన్న రేకుల షెడ్డులోకి వెళ్లారు. అయితే ఆ రేకుల షెడ్డుకు విద్యుత్ సరఫరా అవుతుండటంతో ఇనుప పైపునకు ఆనుకొని ఉన్న వెంకటేష్ షాక్‌కు గురయ్యాడు. అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేష్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి సిబ్బంది పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి తండ్రి ఎనిమిదేళ్ల కిందటే మృతి చెందాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లి లక్ష్మీదేవి అనాథగా మారింది.

వ్యక్తి ఆత్మహత్య



బోయ నాగరాజు (ఫైల్)

గుమ్మఘట్ట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం గ్రామంలో మంగళవారం సాయంత్రం బోయ నాగరాజు(40) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు నాగరాజు మేస్త్రీ పని చేసేవాడు. ఈక్రమంలోనే కొంతకాలం కిందట ఉపాధి కోసం బెంగళూరుకు వెళ్లాడు. అయితే కడుపునొప్పితో బాధపడుతూ కొన్ని రోజుల కిందట తిరిగి స్వగ్రామానికి చేరుకున్నాడు. కడుపునొప్పి మంగళవారం తీవ్రం కావడంతో భరించలేక ఇంట్లో భార్య నాగమ్మ, పిల్లలు బయటకు వెళ్లిన సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య నాగమ్మ, ఇద్దరు కుమారులున్నారు. గుమ్మఘట్ట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హమ్మయ్యా...!

- పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- బాధిత కాంట్రాక్టర్లలో సంతోషం



జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ కార్యాలయం

అనంతపురం సిటీ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలతో ఆగిపోయిన బిల్లులకు ప్రస్తుతం మోక్షం లభిస్తోంది. 2014-18 మధ్యలో పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కాంట్రాక్టర్లకు గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించని విషయం తెలిసిందే. బిల్లుల కోసం వారు పదేపదే కార్యాలయాలు చుట్టూ తిరిగిన ఫలితం లేకుండా పోయింది. కనీసం ఒక్కొక్కరికి 20 శాతం బిల్లులైన చేసి ఉంటే కొంతైనా ఊరట కలిగేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 441 పనులకు సంబంధించి రూ.2.99 కోట్ల బిల్లులను గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. అయితే కూటమి ప్రభుత్వం బాధిత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే విధంగా ఈనెల 15న ఆశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసిది. దీంతో ఆయా కాంట్రాక్టర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి సమగ్ర నివేదిక

గత టీడీపీ పాలనలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండా వైసీపీ ప్రభుత్వం వేధించడంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయారు. దీన్ని గ్రహించిన ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ బిల్లుల కోసం వైసీపీ సర్కార్ చుట్టూ తిరగొద్దని, టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని క్లియర్ చేస్తామని అప్పట్లోనే హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపునకు సిద్ధమైంది. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయగానే.. ఆశాఖ అధికారులు సైతం చకచక పెండింగ్ బిల్లుల వివరాల సమగ్ర నివేదికను అందజేశారు.

ప్రభుత్వానికి అందజేశాం

2014-18 మధ్యలో జరిగిన పనులకు గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టిన విషయం వాస్తవమే. చాలా మంది కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం పెండింగ్ బిల్లులను చెల్లిస్తామని చెప్పడంతో వెంటనే సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేశాం. త్వరలోనే బిల్లులు చెల్లించే అవకాశం ఉంది.

- జహీర్ అస్లాం, ఎస్ఈ, జిల్లా పంచాయతీరాజ్‌శాఖ

పంటనష్టం నివారణకు

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతాంగం పంటనష్టం నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ రామసుబ్బయ్య మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. వరిపంట ప్రస్తుతం గింజ గట్టిపడే దశ నుండి కోతదశకు చేరుకుందన్నారు. ప్రస్తుతం పంటను కోయరాదన్నారు. ఇంతకుముందే కోసినట్లయితే గింజలు నల్లబడకుండా, మొలకెత్తకుండా ఎకరాకు 20 కేజీల ఉప్పుద్రావణం చల్లుకోవాలన్నారు. గింజదశలో వరిపంట పడిపోయినట్లయితే నీరు బయటకు వెళ్లేలా చేయాలన్నారు. గింజలు మొలకెత్తకుండా ఐదు శాతం ఉప్పుద్రావణం వెన్నులపైన పిచికారీ చేయాలని సూచించారు. తద్వారా గింజలు మొలకెత్తవన్నారు. అలాగే జిల్లాలో కందిపంట పూత నుంచి కాయదశకు వచ్చిందన్నారు. వర్షాలకు పూత రాలకుండా ప్లానోఫిక్స్ మిల్లీలీటరు మందును నాలుగు లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. పూత రాకపోతే పొటాషియం నైట్రేట్ ఐదు గ్రాముల మందును లీటరు నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కందిలో మచ్చమార్కుల పురుగు ఉన్నట్లయితే క్లోరిఫైరిఫాస్ 2.5 మిల్లీమీటర్లు లేదంటే హసిఫేట్ 1.5 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వర్షాలు ముఖ్యంగా వేరుశనగ, మొక్కజొన్న, వరి, శనగ పంటలకు అనుకూలమని ఆయన పేర్కొన్నారు.


ఆటోడ్రైవర్‌పై దాడి

అనంతపురం క్రైం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్‌పై ముగ్గురు దాడి చేసిన ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అశోక్‌నగర్‌లో మినర్వాస్కూల్ సమీపంలో ఆటోను రోడ్డుకు అడ్డంగా పెట్టాడనే కారణంతో రిజ్వాన్‌పై అన్వర్, మన్సూర్, ఇక్బాల్ హుస్సేన్ దాడి చేశారు. చంపుతామని బెదిరిస్తూ కొట్టారనే ఫిర్యాదుపై మూడు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

మామా, అల్లుళ్ల గొడవపై కేసు

రామగిరికి చెందిన బాబయ్య శారదానగర్‌లో నివాసముంటున్నాడు. కుమార్తెను నేతాజీనగర్‌కు చెందిన రహంతుల్లాకు ఇచ్చి కొంతకాలం క్రితం పెళ్లి చేశాడు. మామ, అల్లుడు రహంతుల్లా మధ్య ముందునుంచే మనస్పర్థలుండేవి. అక్కంపల్లిలో గతనెల 10న ఓ శుభకార్యం ఉందని, తన కుమార్తెను పంపమని కోరాడు. ఈక్రమంలో మామా,అల్లుళ్ల మధ్య మాటామాటా పెరిగి రహంతుల్లా బాబయ్యను తోసేశాడు. బాబయ్య ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తి అదృశ్యం



రాజశేఖర్

బుక్కరాయసముద్రం మండలం రేకులకుంటకు చెందిన రాజశేఖర్, అతడి భార్య మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో మంగళవారం నగరంలోని నేతాజీనగర్‌లో ఉంటున్న తన సోదరి ఇంటికి వచ్చాడు. ఇంటి నుంచి చెప్పకుండా అదృశ్యమయ్యాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్ బాక్స్ ...

దివ్యాంగుల దినోత్సవం

కొత్తచెరువు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని సమగ్రశిక్ష ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఇందులో జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప, జిల్లా కో-ఆర్డినేటర్ ఆనంద్‌బాబు, భవిత కేంద్ర సిబ్బంది, కొత్తచెరువు, పుట్టపర్తి, బుక్కపట్నం ఐఆర్‌టీలు, హైస్కూల్ ఐఈడీఎస్‌లు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేసుకోండి

నంబులపూలకుంట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఈ యేడాది రబీలో బోరుబావుల కింద సాగుచేసిన పంటను తప్పకుండా నమోదు చేసుకోవాలని ఏఓ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండ లంలోని నల్లగుట్టపల్లితండా, అల్లుగుండు వారిపల్లిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. వేరుశనగ పూత దశలో ఉందని, ఎకరాకు రెండువందల కిలోల జిప్సమ్ చల్లి కలుపు తీయాలని సూచించారు. రసం పీల్చే పురుగులు, ఆకుముడుత, పొగాకు లద్దె పురుగులు పట్ల జాగ్రతగా ఉండాలన్నారు. ఆయన వెంట ఆర్బీకే సిబ్బంది నారాయణస్వామి, రైతులు ఉన్నారు.

సజావుగా ఎన్నికలు నిర్వహించండి

ధర్మవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ మహేశ్ తెలిపారు. స్థానిక షిర్డీసాయిబాబా కల్యాణమండపంలో మంగళవారం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఎన్నికల అధికారులు, ఉప ఎన్నికల అధికారులు, పోలింగ్ అధికారులు, సహాయక అధికారులకు నిర్వహించిన ఒక రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డివిజన్ పరిధిలోని 46 నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. ఒకే రోజు రెండు దఫాలుగా ఈ శిక్షణా తరగతులను నిర్వహించినట్టు వారు తెలిపారు. ఎన్నికల రోజున ఎటువంటి పొరపాట్లకు చోటుఇవ్వరాదన్నారు.

● తనకల్లు: సాగునీటి సంఘాల ఎన్నికలు సజావుగా నిర్వహించాలని ఎన్నికల సిబ్బందికి మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్ బయప్ప సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి నిర్వ హించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చెన్నరాయస్వామి గుడిప్రాజెక్టు (సీజీపీ), మల్లిరెడ్డిపల్లి, కుందిలిపడుగు చెరువు, చిన్నరామన్నపల్లి ఆవులచెరువు, చెక్కవారిపల్లి (కొక్కంటి పెద్దచెరువు), తిమ్మనాయుని చెరువులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, ఎంపీడీఓ రెడ్డెప్ప, డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున పాల్గొన్నారు.

● కదిరి అర్బన్: సాగునీటి సంఘాల ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ, ఇరిగేషన్, ఎన్నికల అధికారులతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ మురళీక్రిష్ణ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 5న నోటిఫికేషన్ వెలువడుతుందని, 8న ఎన్నికలుంటాయని తెలిపారు. ఎన్నికల నిర్వాహణకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పోలప్ప, రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ మహేష్ పాల్గొన్నారు.

ముస్లిం మతపెద్ద మృతి

ధర్మవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ధర్మవరం ముస్లిం మతపెద్ద ఇలాహి అబ్దుల్ సలాం (60) గుండెపోటుతో మంగళవారం మరణించాడు. అతని మృతదేహానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు చింతలపల్లి మహేశ్ చౌదరి, అబ్దుల్ మునాఫ్, నాగూర్‌హుస్సేన్, నడిం మసీద్, అస్లాం, రాళ్లపల్లి షరిఫ్, మాధవరెడ్డి ఉన్నారు.

ఎన్‌టీఏ కార్యవర్గం ఎన్నిక

తనకల్లు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఏ (నోబుల్ టీచర్స్ అసోషియేషన్) మండల కార్యవర్గాన్ని మంగళవారం ఎమ్మార్సీలో ఎన్‌టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా టి. మురళీధర్‌రావు, అధ్యక్షుడిగా ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గారామచంద్ర, ఆర్థిక కార్యదర్శిగా మహేశ్వర్, మహిళ కార్యదర్శులుగా ఎంఆర్ ప్రభావతి, కె.సోనీవిక్రమున్నీషా, అదనపు కార్యదర్శులుగా అరుణమ్మ, రోజశ్రీ, రెడ్డెప్పనాయుడు, విశ్వనాథ్, పెద్దరెడ్డెప్ప, సత్యనారాయణను ఎంపిక చేశారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



బదిలీ సిబ్బందిని సన్మానిస్తున్న సీఐ, ఎస్ఐ

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అ యిన ఏఎస్ఐ కిషోర్‌రెడ్డి, జమేదార్ వెంకటరాముడు, పోలీస్ సిబ్బం ది సాయి, సోము, నారాయణస్వామిని తోటి సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి, ఎస్ఐ బి. మల్లికార్జునరెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు హైందవ శంఖారావం

గాండ్లపెంట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): హిందూసంప్రదాయాలను రక్షించుకోవడానికి గురువారం విజయవాడలో హైందవ శంఖారావం పేరుతో ఓ సభను నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో హిందూవులు అందులో పాల్గొని విజయవంతం చేయాలని వక్తలు కోరారు. మండలంలోని కటారుపల్లి యోగివేమన ఆలయంలో అం దుకు సంబంధించిన పోస్టర్‌ను వారు మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో సమరసతా సేవ జిల్లా కన్వీనర్ నరసింహరావు, హనుమంతురెడ్డి, గంగయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలి

కదిరి అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మడకశిర మండలం ఆమిదాలగొంది ఉన్నత పాఠశాల పీఈటీ ప్రసూనాకు ఇచ్చిన షోకాజ్ నోటీసును వెంటనే ఉపసంహరించుకోవాలని ఏపీపీడీ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు లస్కర్‌నాయక్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. పాఠశాలలో 8వ తరగతి విద్యార్థి చేతన్‌ను మేనమామ విరామ సమయంలో బాలున్ని తీసుకెళ్లి హత్య చేశాడని, ఈ సంఘటనలో బాధ్యులుగా హెచ్‌ఎంను సస్పెండ్ చేయడం, పీఈటీకి షోకాజ్ నోటీసు ఇవ్వడం సరికాదన్నారు.

సెలవుల్లో తరగతులు సరికాదు

నంబులపూలకుంట, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు సెలవు రోజుల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడం తగదని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో ఆయన మాట్లాడుతూ.. మార్చి 10 వరకు ఉదయం 9.15 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఒకవైపు బోధనేతర పనులతో ఉపాధ్యాయులు ఒత్తిడికి లోనవుతున్న సమయంలో సెలవుల్లో కూడా అదనపు తరగతులు నిర్వహించాలనడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజుల యాదవ్, రమణనాయక్, మురళి, శివయ్య, సందీప్, గోవర్థన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రగతి బాటలు

- జోరుగా కదిరి-గాండ్లపెంట రహదారి పనులు
- అదే రీతిలో కదిరి-ఎన్పీకుంట రోడ్డు పనులు
- ఐదేళ్లలో వందలకొద్దీ ప్రమాదాలు
- కూటమి పాలనలో శరవేగంగా పనులు



రూపుమారిన కదిరి-గాండ్లపెంట రహదారి

కదిరి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కదిరి-గాండ్లపెంట రోడ్డు... ఆ రహదారిలో ప్రయాణమంటేనే అందరికీ హడల్. ఆ రహదారి ద్వారా వెళ్లాల్సి వస్తే మరో ప్రత్యమ్నాయ రహదారి కోసం వెదికేవారు. దూరం ఎక్కువైనా ఫరవాలేదు కాని ఈ దారిలో మాత్రం ప్రయాణం చేసేవారు కాదు. తప్పని పరిస్థితుల్లో ఎన్‌పీకుంట, గాండ్లపెంట, కదిరి రూరల్ వాసులు వెళ్లేవారు. ఐదు సంవత్సరాలు వందల కొద్ది ప్రమాదాలు జరిగాయి. కొంతమంది ప్రాణాలు పోగొట్టుకుంటే, మరి కొంతమంది గాయాలపాలయ్యారు. ఆ రహదారి నిత్యం ప్రమాదాలకు నెలవుగా మారింది. వైసీపీ పాలనలో ఆ రోడ్డుకు మరమ్మతులు మొదలు పెట్టినా... నిధులు మంజూరు చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో ఆ రహదారిలో ఎక్కడ చూసినా గుంతలు ఉండేవి. ఎన్నికల ప్రచారంలో కందికుంట వెంకటప్రసాద్ తాను గెలిస్తే ఆ రహదారి నిర్మాణాన్ని మూడు నెలల్లో ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఎమ్మెల్యే కందికుంట తన హామీ మేరకు రహదారి పనులను అక్టోబరులో ప్రారంభించారు. ఆ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

● ప్రయాణం.. నరకం..

ఈ రహదారిలో ప్రయాణం అంటే అందరికి గుండె దడే. 45 నిమిషాలు పట్టే ప్రయాణం దాదాపు రెండు గంటలకు పైగా పడుతుంది. ఇక డ్రైవర్ల పరిస్థితి చెప్పనక్కర్లేదు. గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ రహదారిలో వందలాది ప్రమాదాలు జరిగాయి. అనేక మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. అనేక మంది గాయపడ్డారు. వీరిలో ఎక్కువ మంది ద్విచక్రవాహదారులే. కంకరతేలిన రోడ్డులో అనేక మంది పడిపోయారు. వాహనాలు పాడైపోయాయి. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి అనేక మంది ద్విచక్రవాహదారులు కిందపడి గాయపడ్డ సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇక రాత్రుల్లో ప్రమాదాలు మరిన్ని జరిగేవి. ముఖ్యంగా మద్దివారిగొంది వెళ్లే రహదారి నుంచి దోరనాల వరకు, గాండ్లపెంట నుంచి దనియాని చెరువు వరకు ప్రయాణం నరకం. ఇక్కడే ఎక్కువ ప్రమాదాలు జరిగాయి.

● రూ. 34 కోట్లతో పనులు

కదిరి-ఎన్‌పీకుంట మధ్య దూరం దాదాపు 40 కిలోమీటర్లు . కదిరి రూరల్‌తో పాటు, గాండ్లపెంట, ఎన్‌పీకుంట మండలాలు గుండా రాయచోటికి వెళుతుంది. సింగిల్ రోడ్డు ఉండడంతో వైసీపీ ప్రభుత్వం ఎన్‌డీపి (నేషనల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు) కింద పనులు చేపట్టింది. ప్రాజెక్టు విలువ దాదాపు 34 కోట్లు వరకు ఉంది. వైసీపీ ప్రభుత్వం పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్‌లకు బిల్లులు ఇవ్వకపోవడంతో ఆ పనులు నాలుగు సంవత్సరాలుగా ఆగిపోయాయి. ఉన్న రోడ్డు కాస్త గుంతలమయమైంది.

● త్వరలో పనులు పూర్తి

కందికుంట వెంకటప్రసాద్ ప్రజలకు ఇచ్చిన మాట మూడు నెలల్లో పనులు ప్రారంభించారు. ప్రభుత్వం మీద నమ్మకంతో పనులు చేపట్టారు. అప్పటికి ఇంకా రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీపీపై ఎటువంటి నిర్ణయమూ తీసుకోలేదు. అయినా ప్రజల బాధలు తప్పించడానికి పనులు చేపట్టారు. ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీపీపై నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర వాటాగా రూ.500 కోట్లు విడదల చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో పనులు వేగవంతం అయ్యాయి. గాండ్లపెంట వరకు పూర్తి స్థాయి రోడ్డు నిర్మాణం పూర్తి కావచ్చింది. మరో పది రోజుల్లో గాజుల వారిపల్లి వరకు రహదారి పూర్తి అవుతుందని అధికారులు చెబుతున్నారు. దనియాని చెరువుకు సమీపంలో ఉన్న గుట్ట తొలగించడానికి కొంత సమయం పడుతుందని, అది పూర్తి అయితే ఎన్‌పీకుంట రహదారి నిర్మాణం పూర్తి అవుతుందని టీడీపీ నాయకులు క్రిష్ణమోహన్ చెబుతున్నారు.

ఇప్పుడు రోడ్డు బాగుంది



గాండ్లపెంట కదిరి మధ్య తార్‌రోడ్డు వేయడంతో ప్రయాణం బాగా జరుగుతోంది. నాలుగేళ్లగా రోడ్డు బాగలేకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. బస్సులు, ట్రిపర్ల వెనుక ద్విచక్రవాహనంలో వెళ్తుంటే దుమ్ము దుళితో నిండిపోయేవారం. ప్రమాదాలు కూడా చాలా జరిగాయి. మరికొన్ని రోజుల్లో ఈ రోడ్డు పనులు పూర్తి అవుతుండటంతో ఇక్కడి వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

-బావాసాబ్, గాండ్లపెంట

వరి పంటకు వర్షం దెబ్బ

నంబులపూలకుంట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో చేతికొంచిన వరిపంట నీటిలో మునిగిపోయింది. మండలంలో తిమ్మమ్మ మర్రిమాను ప్రాంతంలో గొల్లోని కుంటకింద సాగుచేసి 30 ఎకరాల్లో పంట పూర్తిగా నేలకొరిగింది. రెండు, మూడు రోజు ల్లో పంటను కోత కోయాల్సి ఉంది. వర్షానికి వరిగింజలన్ని తడవడంతోపాటు నేలరాలిపోయినట్లు రైతులు వాపోతున్నారు. వర్షాలు ఇలాగే కురిస్తే పంట పూర్తిగా దెబ్బతింటుందని రైతులు బాధపడుతున్నారు. తిండి గింజలు, గ్రాసం కూడా దక్కకుండాపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్పీకుంటలో నేలరాలిన వరిపంట



క్రికెట్ పోటీల్లో ప్రతిభ



తేజశ్వినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

కదిరి అర్బన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పుదుచ్చేరిలో జాతీయ స్థాయిలో బీసీసీఐ నిర్వహించిన పోటీల్లో కదిరి క్రీడాకారిణి తేజశ్వణిని ప్రతిభచాటింది. కుడిచేతి బౌలర్ అయిన తేజశ్విని బీసీసీఐ మ్యాచ్‌ల్లో మహారాష్ట్రపై రెండు, మేఘాలయపై 4, పుదుచ్చేరి, ఉత్తరా ఖాండ్‌పై రెండు వికెట్లు.. మొత్తం 11 టాప్ ఆర్డర్ వికెట్లు తీసి ఆంధ్ర జట్టు విజయంలో కీలకపాత్ర వహించింది. ఈనెల 9 నుంచి జైపూర్‌లో జరిగే నాక్‌అవుట్ పోటీల్లో పాల్గొంటోంది. ఈ నేపథ్యంలో తేజశ్వణిని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్వగృహంలో మంగళవారం అభినందించారు. ఆమె వెంట కోచ్ నజీర్ ఉన్నారు.

● ఆర్టీసీ బస్సులు ప్రారంభం

కదిరి: కదిరి ఆర్టీసీ డిపోకు చెందిన నూతన బస్సులను స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మైనోద్దీన్, ఆర్టీసీ ఉద్యోగులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రుణాల రికవరీపై దృష్టి సారించండి

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): రుణాల రికవరీపై దృష్టి సారించాలని డ్వామా పీడీ నరసయ్య సూచించారు. మంగళవారం స్థానిక పల్లవీ మండల సమాఖ్య కార్యాలయంలో నల్లమాడ, ఓడీచెరువు, అమడగూరు, నల్లచెరువు, తనకల్లు మండలాల సిబ్బందితో నిర్వహించిన క్లస్టర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మొబైల్ బుక్‌కీపింగ్, సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్స్, వీఓ గ్రేడింగ్‌పై సమీక్షతో పాటు సీఐఎఫ్ రివరీలను త్వరగా పూర్తి చేయాలన్నారు. స్త్రీనిధి, ఉన్నతి రికవరీతో పాటు రుణాల మంజూరుపై లెక్కించారు. సంఘం, గ్రామ సంఘాల పుస్తకాల అప్‌డేట్‌తో పాటు బ్యాంక్ లింకేజీ, జాబ్స్ తదితర వాటిపై సమీక్షించారు. సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో డీపీఎంఎల్‌హెచ్ రామమోహన్, ఏరియా కోఆర్డినేటర్ రవీంద్ర, ఏపీఎంలు రమణమ్మ, రాజశేఖర్, లలిత, అమడగూరు భారతి, ఎస్ఎస్ మేనేజర్ ఆనంద్‌రావు, ఎల్‌సీసీ మునెప్ప, ఐదుమండలాల సీసీలు, ఎంఎస్‌ఎలు పాల్గొన్నారు.

లంచాలివ్వకుంటే సర్టిఫికెట్లు ఇవ్వరా..?

అధికారులపై మండిపడ్డ మంత్రి పీఏ హరీష్



అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న హరీష్

బత్తలపల్లి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'వారాల తరబడి స్కూల్ పిల్లలు, వారి తల్లిదండ్రులు జనన ధ్రువీకరణ పత్రాల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయినా పనులు కావడం లేదు. లంచాలు ఇస్తేనే మీరు సర్టిఫికెట్లు ఇస్తారా.. లేకుంటే ఇవ్వరా.. ?' అని సచివాలయంలో సిబ్బందిపై మంత్రి పీఏ హరీష్ బాబు అగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఆర్డీటీ ఆసుపత్రిలో జన్మించిన వారందరికి బత్తలపల్లి సచివాలయం1లో జనన ధ్రువీకరణ పత్రాలు ఇస్తారు. వాటి కోసం ఇతర జిల్లాల నుంచి కూడా చాలా మంది నెలల తరబడి వచ్చి వెళ్తున్నారు. మంగళవారం విసిగిపోయిన వారు తాడిపత్రి రోడ్డు పై ధార్నాకు దిగారు. పోలీసులు వారికి సర్దిచెప్పి పంపించారు. ఈ విషయం తెలుసుకున్న హరీష్ ఆ సచివాలయానికి వచ్చాడు. సిబ్బంది, ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. వెంటనే అదనపు సిబ్బందిని ఏర్పాటు సమస్యను పరిష్కరించాలని సూచించారు.

● గ్రీవెన్స్ డేలో పలు ఫిర్యాదులు

తాడిమర్రి: స్థానిక సచివాలయంలో మంగళవారం గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో మంత్రి సత్యకుమార్ పీఏ హరీశ్‌బాబుకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఏటీఓ కార్యాలయం తనిఖీ

ధర్మవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏటీఓ (అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్) కార్యాలయాన్ని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ మోహన్‌రావు మంగళవారం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ట్రెజరీ అధికారి పద్మనాభం, విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చలపతి, సభ్యులు ఆయనను సన్మానించారు.

క్రైం న్యూస్..

అనారోగ్యంతో బేల్దారి ఆత్మహత్య



భీమానాయక్ (ఫైల్)

ధర్మవరం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన భీమానాయక్ (20) అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతను బేల్దారి పనుల కోసం వచ్చి తోటి కార్మికులతో కలిసి స్థానిక పీఆర్‌టీలో నివాసం ఉండేవారు. అయితే అతను అప్పుడప్పుడు కడుపునొప్పితో బాధపడేవాడు. మంగళవారం రాత్రి కడుపునొప్పి తీవ్రమైంది. దీంతో తోటి కార్మికులు బయటకు వెళ్లినప్పుడు రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తర్వాత రూమ్‌కు వచ్చిన తోటి కార్మికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్ఐ పుట్టప్ప తన సిబ్బందితో సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

టీడీపీ నాయకుడిపై దాడి

నల్లమాడ డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొన్నికోట గ్రామానికి చెందిన టీడీపీ వార్డు సభ్యుడు కుచ్చెపు రాజశేఖర్‌పై అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వారాది, అతని భార్య లక్ష్మీదేవి దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు మంగళవారం నల్లమాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ దాదాపీర్ తెలిపిన వివరాల మేరకు.. రాజశేఖర్ పొలంవైపు రస్తా ఉండేదని, రస్తా విషయంలో రాజశేఖర్, వారాది వివాదముందని తెలిపారు. ఈవిషయమై కుచ్చుపు రాజశేఖర్‌పై దాడిచేసి కొట్టారని తెలిపారు. బాధితుడు ఫిర్యాదుచేయడంతో వారాది, లక్ష్మీదేవిపై కేసు నమోదు చేసిచేసినట్లు చెప్పారు.

● పరామర్శించిన నాయకులు: దాడిలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కుచ్చెపు రాజశేఖర్‌ను టీడీపీ మండల నాయకులు పరామర్శించారు. వారిలో కన్వీనర్ మైలే శివశంకర్, బుట్టినాగభూషణ నాయుడు, డీలర్ శంకర్, నరసింహులు, రవి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

జూదరుల అరెస్టు

తాడిమర్రి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దెల చెరువు గ్రామ సరిహద్దుల్లో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ కృష్ణవేణి మంగళవారం తెలిపారు. వారివద్దనున్న రూ.8,770 నగదు స్వాధీనం చేసుకున్నామని, వారిపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరుస్తామని అన్నారు.

మహిళపై అత్యాచారయత్నం

ధర్మవరంరూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నూరు బత్తలపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఓ తోటలో నివాసముంటున్న ఓ వివాహితపై సోమవారం అర్ధరాత్రి అత్యాచారానికి యత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో పశువుల పాకలో నిద్రిస్తున్న ఆమె భర్త, అత్త, మామా రావడంతో శ్రీనివాసులు పారిపోయాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు.


జడ్పీ నిధులు తిరుగు టపా..!

- సెప్టెంబరులో రూ.1.68 కోట్ల గ్రాంట్
- జడ్పీ నుంచి నవంబరు 29న మండలాలకు..
- ఒక్క రోజులో బిల్స్ సబ్మిట్ చేయలేక నష్టం
- సీఈఓ, అకౌంట్స్ విభాగం అధికారుల నిర్లక్ష్యం

అనంతపురం విద్య, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ కమిషనర్ నిధులు విడుదల చేసినా.. జడ్పీలో కొందరు సకాలంలో ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో కోట్ల రూపాయలు వెనక్కు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. ఓటాస్ అకౌంట్ కింద ఇటీవల విడుదల చేసిన నిధులు రద్దయ్యే ప్రమాదం కనిపిస్తోంది. పీఆర్ కమిషనర్ రూ.1.68 కోట్ల నిధులకు సెప్టెంబరులోనే ఉత్తర్వులు ఇచ్చారు. ఆ నిధులను మండలాలకు సర్దుబాటు చేస్తూ.. జడ్పీ సీఈఓ చాలా ఆలస్యంగా ఉత్తర్వులిచ్చారు. మండలాల్లో ఆ నిధులు డ్రా చేసుకోడానికి అవకాశం లేకపోవడంతో ఎంపీడీఓలు బిల్లులు సబ్‌మిట్ చేయలేదని తెలుస్తోంది. ఫలితంగా కోట్ల నిధులు రద్దేయ్యే ప్రమాదం తలెత్తిందని ఎంపీడీఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని చాలా మండలాల్లో జడ్పీ ఉన్నతాధికారుల వైఖరిపై ఎంపీడీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● సెప్టెంబరులో ఉత్తర్వులు

జడ్పీ, ఎంపీడీఓ కార్యాలయాల పాలన సౌలభ్యం కోసం పీఆర్ కమిషనర్ ఓటాస్ అకౌంట్-2 బడ్జెట్ కింద నిధులు విడుదల చేశారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి నవంబరు 30వ తేదీ వరకూ నాలుగు నెలల కాలానికి ఈ నిధులు ఇచ్చారు. ఇందులో సీనరేజీ గ్రాంట్స్, రూ.8 పర్ క్యాపిటా, ఎంపీడీఓల వాహన అద్దె, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీల గౌరవ వేతనం, ఉద్యోగుల టీఏ, డీఏ బిల్లులు చెల్లింపునకు అవసరమైన నిధులు ఉన్నాయి.



● నిధులకు గండం

కమిషనర్ ఇచ్చిన గ్రాంట్‌ను ఉమ్మడి జిల్లాలోని 63 మండలాలకు వెంటనే సర్దుబాటు చేస్తూ సీఈఓ ఉత్తర్వులు ఇవ్వాలి. అలా చేసి ఉంటే.. అన్ని మండలాల అధికారులు ఆ నిధులు డ్రా చేసుకునే వెసలుబాటు ఉండేది. కానీ జడ్పీ అకౌంట్స్ విభాగం అధికారుల నిర్లక్ష్యం, సీఈఓ అలసత్వం కారణంగా గత నెల 11వ తేదీ పేరిట కొన్ని, 30వ తేదీ పేరిట మరికొన్ని ఉత్తర్వులు సిద్ధం చేసి.. గత నెల 29న వాట్సాప్ గ్రూప్‌లో వేశారు. ఈ ఉత్తర్వుల ఆధారంగా.. ఒక్క రోజులో ఎంపీడీఓలు బిల్స్ సబ్‌మిట్ చేయడం, ట్రెజరీ వాళ్లు వాటికి ఒకే చెప్పడం అయ్యే పనేనా..? ఇదే కారణంగా చాలా మండలాల్లో ఆ నిధులు డ్రా చేయలేదని సమాచారం. ఈ నెల ఒకటో తేదీ నుంచి సీఎఫ్‌ఎంఎస్ బంద్ అయ్యింది. చాలా మండలాలకు ఆ నిధులు అందకుండానే వెనక్కువెళ్లినట్టయ్యింది. దీంతో ఎంపీడీఓలు మండిపడుతున్నారు. జడ్పీలోని అకౌంట్స్ విభాగంలో అనుభవం లేని ఉద్యోగులను వేసుకోవడం, అకౌంట్స్ విభాగంలో ఓ సీనియర్ అసిస్టెంట్ అడ్డగోలు నిర్ణయాలు తీసుకోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్న విమర్శలు వస్తున్నాయి. బదిలీల సమయంలో చక్రం తిప్పిన ఆయన.. ఆ తంతు ముగియగానే మామూళ్లు బాగా వచ్చే అకౌంట్స్ విభాగానికి వేయించుకున్నారని, అక్కడ అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటూ జడ్పీ పాలనను భ్రష్టు పట్టిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కింది స్థాయి అధికారులు ఎలాగున్నా, జడ్పీ ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కూడా ఇందులో కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. దీనిపై వివరణ కోరడానికి జడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్యకు ఫోన్ చేయగా.. అందుబాటులోకి రాలేదు.

ఇవీ .. ఆ నిధులు

మండలాలకు రూ.8 పర్ క్యాపిటా గ్రాంట్	రూ.26,03,876
సీనరేజీ చార్జెస్ గ్రాంట్	రూ.88,43,031
సభ్యుల గౌరవ వేతనం	రూ.45,43,437
స్టాఫ్ టీఏ, డీఏ గ్రాంట్	రూ.1,74,014
ఎంపీడీఓల వాహనాల అద్దె	రూ.7,29,209
మొత్తం	రూ.1,68,93,567

చెట్టుపై పడిన పిడుగు



వేపచెట్టుపై పడిన పిడుగు

పుట్టపర్తి రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచు వారిపల్లిలో మంగళవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో భారీ వర్షం కురిసిందన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం వచ్చింది. ఆ సమయం ఓ పిడుగు చాకలి గంగన్న ఇంటి సమీ పంలోని వేపచెట్టుపై భారీ శబ్దంతో పడటంతో ఆ గ్రామస్థులంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పిడుగు పాటుకు ఆ చెట్టుకొమ్మ విరిగి పడింది. ఆ శబ్దానికి చాకలి కేశన్న భార్య గంగమ్మ స్పృహ తప్పారని, పలు గృహాల్లో గృహోపకరణాలు, ఇంటిలోని మీటర్లు దగ్గమయ్యాయని పంచాయతీ సెక్రటరీ ప్రవీణ్ తెలిపారు. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు.

వీఓఏల తొలగింపు తగదు

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వీఓఏల విధులకు ఆటంకాలు, తొలగింపులకు గురిచేస్తున్న సీసీ (కమ్యూనిటీ కో-ఆర్డినేటర్)పై చర్యలు తీసుకోవాలని జిల్లా సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ రవీంద్రకు వినతిపత్రం అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, లక్ష్మీనారాయణ, మండలాధ్యక్షుడు కుళ్లాయప్ప మాట్లాడుతూ.. ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ మైనార్టీ వర్గాలకు చెందిన వారు 18 సంవత్సరాలుగా వీఓఏగా పనిచేస్తున్నారని, కొంతమంది సీసీలు వారిని విధుల నుంచి తప్పుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వీఓఏలు రంగులాల్, శశికళ, అంజి, వెంకటరమణ, నరసింహులు పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

క్రీడాపోటీల్లో విజేతలకు అభినందన



విజేతలను అభినందిస్తున్న టీచర్లు

గోరంట్ల, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి):స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ద్వారా వివిధవిభాగాల్లో జరిగిన క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయిలో పాల్గొన్న గోరంట్ల బాలికోన్నత పాఠశాల విద్యార్థినులను ఉపాధ్యాయులు మంగళ వారం అభినందించారు. అండర్-19 బాల్ బ్యాడ్మింటన్ లో రాష్ట్రస్థాయిలో రాణించి రెండవస్థానం సాధించడం ద్వారా రన్నర్స్ కప్పును కైవసం చేసుకున్నారు. అలాగే సాఫ్ట్‌బాల్‌లో టెన్త్ చదువుతున్న సాహిత్య, 8వ తరగతి చదువుతున్న శ్వేత, త్రోబాల్‌లో 9వతరగతి చదువు తున్న హర్షిత, బేస్‌బాల్‌లో టెన్త్ విద్యార్థిని దివ్య, 8వతరగతి చదువుతున్న పవిత్ర, రూపా, కళ్యాణి, పల్ల విలు జిల్లాస్థాయిలో గెలుపొంది, రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. వీరందరిని పాఠశాల హెచ్‌ఎం మాధవీలత, పీడీ సూర్యనారాయణమ్మలు అభినందిం చారు. ఇదే పోరాటపటిమతో ముందుకెళితే విజయం తప్పక వరిస్తుందన్నారు.

నేడు సంఘీభావ ర్యాలీ

హిందూపురం అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లోని హిందువుల పరిరక్షణకై డిసెంబరు 4న సంఘీభావ ర్యాలీ చేపట్టనున్నట్లు హిందూ ఐక్యవేదిక ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ ర్యాలీ చిన్నమార్కెట్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు జరుగుతుందని హిందువులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు. ర్యాలీ బుధవారం సాయంత్రం 4.30 నిమిషాలకు ప్రారంభ మవుతుందని, బంగ్లాదేశ్‌లోని హిందువుల పరిరక్షణ మన బాధ్యత అని ఐక్యవేదిక పేర్కొంది.

ప్రీమియం చెల్లించిన రైతులకు శుభవార్త

పరిగి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వరి, వేరుశనగ టమోటా సాగుచేసిన రైతులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ధనాపురం, బీరేపల్లి గ్రామాలలో ఏడీ అల్తాఫ్ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలు స్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో ప్రధాన పంటలైన వరి, వేరుశనగ, టమోటా పంటలు సాగుచేసి వర్షాధారంతో పంట నష్టపోతే బ్యాంక్‌లో పంట ప్రీమియం చెల్లించిన రైతులకు నష్టపరిహారం కింద ప్రభుత్వం తరుపున ఎకరా వరిపంటకు రూ.42వేలు, వేరుశనగకు రూ.32వేలు, టమోటాకు రూ.32వేలు, నష్టపోయిన రైతు ఖాతాలో ప్రభుత్వం నగదు జమచేస్తుందన్నారు.

ఎస్.రాయాపురం మీదుగా బస్సు నడపాలి

గుడిబండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మడకశిర డిపో నుండి క్రైమరబస్సును ఎస్.రాయాపురం మీదుగా నడపాలని గ్రామస్తులు నాగేంద్రప్ప, రామతమ్మణ్ణ, రాజ్‌కుమార్, సన్నీరప్ప, క్యాతప్ప, నాగేంద్ర, తదిత రులు కోరారు. గతంలో క్రైమర బస్సును మడకశిర నుండి హొట్టేబెట్ట, ఎస్.రాయాపురం, మందలపల్లి మీదుగా నడిపేవారు. ఈరూటులో మంచి కలెక్షన్ అయ్యేది. ప్రస్తుతం బస్సు మడకశిర, జంబులబండ మీదుగా క్రైమరకు వెళుతోందని, ఈరూట్‌లో ఆటోలు, క్యాబ్‌లు విపరీతంగా ఉండటంతో కలెక్షన్లు లేక ఆర్టీసీ బస్సుకు నష్టం వాటిల్లుతుందని ప్రజలు అంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు చొరవతీసుకొని క్రైమర బస్సును పాతరూట్‌లోనే యధావిధిగా నడపాలని ప్రజలు కోరుతున్నారు.


పాఠశాలకు మరమ్మతులు చేపట్టండి



పెచ్చులూడుతున్న బొమ్మరసనపల్లి పాఠశాల పైకప్పు

అగళి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అగళి మండలం బొమ్మరసనపల్లి ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిథిలా వస్థకు చేరుకుందని ఆ గ్రామస్థులు తెలిపారు. పాఠ శాలలో 13మంది విద్యార్థులు చదువుకుంటున్నారని వర్షం వస్తే జలమయంగా మారుతుందని వారు వాపోయారు. పాఠశాల భవనం కూడా పాతదేనని పై కప్పు కూడా పెచ్చులూడుతోందన్నారు. వర్షం వచ్చిన ప్పుడు విద్యార్థులు వరండాలో కూర్చుని చదువుకోవా ల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఈ పాఠశాలను నాడు నేడు కింద కూడా ఎంపిక చేయలేదన్నారు. అధికా రులు స్పందించి పాఠశాల భవనం మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

బాలామృతాన్ని పరిశీలించిన సీడీపీఓ



స్టాక్‌ను పరిశీలిస్తున్న సీడీపీఓ నాగమల్లేశ్వరి

మడకశిరటౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): చిన్నా రులకు సరఫరా చేసే బాలామృతానికి సంబంధించిన చిక్కీలు, పాలు వంటి వస్తువులను మంగళవారం పట్టణంలోని గోడౌన్‌లో సీడీపీఓ నాగమల్లేశ్వరి పరిశీ లించారు. నియోజకవర్గం వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న పాలు, చిక్కీలతోపాటు ఇతర వస్తువులకు సంబంధించిన వాటి నాణ్యతను పరిశీలించారు. సకాలంలో అంగన్‌వాడీ కేంద్రాలకు చేర్చాలని వారికి సూచించారు.

14న జాతీయ మెగా లోక్ అదాలత్

మడకశిర టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ మెగా లోక్ అదాలత్ ఈనెల 14వతేదీన నిర్వ హిస్తున్నామని, జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని మడక శిర జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ అన్నారు. ఆయన మంగళవారం బార్‌రూమ్‌లో న్యాయవాదు లతో సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ అదా లత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారు లకు డబ్బుతోపాటు సమయం కూడా ఆదా అవుతుం దన్నారు. న్యాయవాదులు సైతం ప్రజల్లో అవగాహన కల్పించి జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సద్వి నియోగం చేసుకొని కేసులు పరిష్కరించుకొనేలా అవ గాహన కల్పించాలని కోరారు.

ఎమర్జెన్సీ డ్యూటీకెళితే ఎడాపెడా కోత



- ఆదివారం సెలవు వదులుకుని విధులకు హాజరు
- మర్నాడు ఆఫ్ తీసుకుంటే జీతంలో కోత
- అత్యవసర సమయంలో రక్త సరఫరా ఎలా?
- ఇలా అయితే పనిచేయలేమంటున్న రక్తనిధి ఉద్యోగులు

హిందూపురం రక్తనిధి కేంద్రంలో పనిచేసే ఉద్యోగులకు ఆదివారం సెలవు. అయినా అత్యవసర రోగులకు రక్తం సమకూర్చడానికి ఆ రోజు డ్యూటీ కెళ్లి మరోరోజు సెలవు తీసుకుంటే అభినందించాల్సిందిపోయి జీతం కట్ చేస్తుండడం శోచనీయం.

హిందూపురం అర్బన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అత్యవసర సేవలందించే నేషన్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నిబంధనలు గందరగోళంగా రూపొందిం చడంతో అది అసలుకే ఎసరుతెస్తోంది. ఎన్.హెచ్.ఎం నిబంధనల ప్రకారం డ్యూటీ చేసేవారికి ఆది వారం, ఇతర సెలవు దినాలు వర్తిస్తాయి. అయితే వైద్య విభాగంలోని రక్తనిధిలో పని చేసేవారు ఎప్పుడూ సేవలు అందించాల్సిందే. ప్రమాదాలు జరిగిన సమయంలో, కాన్పుల సమయంలో ఇతర సమయాల్లో అవసరం అయిన రక్తాన్ని క్షణాల్లో అందిం చాల్సి ఉంటుంది. అంటే వారు 24 గంటలు విధుల్లో ఉండాలి. అయితే వారు అన్ని గంటల సేపు విధులు నిర్వహించడంవలన మరుసటి రోజు సెలవు తీసుకుంటారు. సర్దుబాటు చేసుకొని విధులు చేపడుతూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారు. అయితే సర్దుబాటు చేసుకుని 24 గంటలు డ్యూటీ చేసినా మరుసటి రోజు మాత్రం మామూలుగానే ఫేషియల్ యాప్ ద్వారా హాజరు వేయాలని అంటున్నారు. ప్రజల సౌకర్యం కోసం ఆదివారమైనా, మరో సెలవురోజైనా సిబ్బంది ఆ రోజు పని చేసి మరు సటి రోజు సెలవు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. రోజంతా విధులు నిర్వహించి మరుసటి రోజు సెలవు తీసుకోవడంతో ఫేషియల్ యాప్ అటెండెన్స్ వేయలేకపోతు న్నారు. దీంతో జీతాల్లో కోత విధిస్తున్నారు. వచ్చేది అరకొర జీతం అందులో కోత విధిస్తే ఎలాగని ఆవేదన చెందుతున్నారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి రక్త నిధి విభాగంలో ఇద్దరు ఎన్‌హెచ్‌ఎం కింద ఒకరు ఔట్ సోర్సు కింద పని చేస్తు న్నారు. ఎన్.హెచ్.ఎం. నిబంధనల ప్రకారం వీరు విధులు నిర్వహించి సెలవు దినాల్లో రాకపోతే అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తీవ్ర ఇబ్బంది తప్పదు. ఆ దినాల్లో ఆసుపత్రికి సిబ్బంది రాకపోతే రోగుల ప్రాణాలకే ప్రమాదం. అలాగని డ్యూటీ చేస్తే కష్టానికి ఫలితంగా జీతం అందడంలేదు. ఇలాగైతే డ్యూటీలు ఎలా చేయాలని అధికారులను అడిగితే వారి పరిధిలోని సూపరింటెండెంట్‌లను అడ గాలని చెబుతున్నారు. ఇచ్చేది కేవలం రూ. 23 వేలు. అందులో కట్ చేస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ నెలలో దాదాపు ఒక్కొక్కరికి రూ.6 వేల వరకు జీతం కట్ అయిందంటున్నారు. పిల్లల చదువులు, ఇంటి అద్దెతో ఇప్పటికే సతమతమవు తుంటే కోతలతో కలత చెందాల్సి వస్తోందని అంటున్నారు. దీనిపై ఉన్నతాధికా రులు స్పందించి సమస్య పరిష్కరించి న్యాయంచేయాలని వేడుకుంటున్నారు.

కోత విధిస్తే కుటుంబం గడవాలి? .: వలి, బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్

ఆదివారమైనా సేవలు అందిస్తున్నాం. బ్లడ్ బ్యాంకులో ముగ్గురు టెక్నీషియన్లు విధులు నిర్వహిస్తున్నాము. ఫేషియల్ యాప్ ద్వారా అటెండెన్స్ తక్కువగా చూపుతూ జీతంలో కోత విధించారు. వచ్చేది రూ.21 వేలు. అందులో రూ.5500 కోత విధించారు. ఇలాగైతే కటుంబం నెట్టుకొచ్చేది ఎలా?

వచ్చేదే అరకొర జీతం: ఆంజనేయులు

వచ్చేదే అరకొర జీతం. దాంతోనే సర్దుకుని కటుంబ పోషణ చేస్తున్నాము. అందు లోను కోత విధిస్తే కష్టంగా ఉంది. ఈ నెల జీతంలో రూ.4500 కోత వేశారు.

జిల్లా వైద్యాధికారికి తెలిపాం..



బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ల సమస్య తెలిసింది. ఈ విషయాన్ని లెటర్ రూపంలో డీఎంహెచ్‌కు పంపాము. వారు నేషనల్ హెల్త్ మిషన్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చూస్తామన్నారు. ఎన్‌హెచ్‌ఎం ప్రకారం డ్యూటీ చేస్తే బ్లడ్ బ్యాంకులో సేవలు నిలిచిపోతాయి. ప్రజలు ఇబ్బంది పడుతారు.

-లక్ష్మీరాం నాయక్, ఇన్‌చార్జి సూపరింటెండెంట్

తపాలా సేవలను ప్రజలకు తెలియపర్చండి

గుడిబండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు తెలియజేయాలని హిందూ పురం పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ తపాలా సిబ్బందికి సూచించారు. మంగళవారం గుడిబండ మండల పరి షత్ కార్యాలయంలో మండలంలోని పోస్టుమాస్టర్‌లతో సమా వేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తపాలా శాఖ ద్వారా ప్రజలకు ఇన్సూరెన్స్, ఆర్‌డీలు తదితర కొత్త పథకాలు ప్రవేశపెట్టారని, ఆపథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. పోస్టాఫీసుల ద్వారా ఆన్‌లైన్ ఖాతాలు తెరిచి బ్యాంకులకు సమానంగా సేవలు అందిస్తామని ప్రజలకు వివరించాలన్నారు. తపాలా శాఖ ద్వారా కొత్త పథకాలపై సిబ్బం దికి తెలియజేశారు. ఈకార్యక్రమంలో పోస్టల్ అధికారులు నర సింహప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పురంలో పద్మవ్యూహంలా ట్రాఫిక్

రోడ్డుపై అడ్డంగా ద్విచక్రవాహనాలు ఉంచడంతో అంతరాయం

హిందూపురం అర్బన్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అతి ఎక్కువగా జన సంచారం ఉన్న వీడీ రోడ్డు సాయంత్రం అయిం దంటే చాలు పద్మవ్యూహంలా తయారౌతుంది. రోడ్డుకు ఇరుపక్కలా అడ్డదిడ్డంగా వాహనాలు ఆపేస్తున్నారు. ద్విచక్రవాహనాలు అటు నుంచి ఇటు వెళ్లాలంటే శ్రమించాల్సిందే. ఇక కారులు అయితే అతి కష్టం మీద దాటాల్సి ఉంటుంది. హిందూపురం పట్టణంలో వీడీ రోడ్డు ఎరుగని వారు ఉండరు. చిరుతిండ్లకు అడ్డాగా ఉంది. దాదాపుగా పదుల సంఖ్యలో హోటల్‌లు వెలిసి నాయి. ప్రతి రోజు వందల మంది చిరుతిళ్ళు ఆరగించేందుకు రోడ్డుమీదకు వస్తున్నారు. ద్విచ క్రవాహనాలు రోడ్డుకు అడ్డంగా ఉంచేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ జామ్ అయి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. రోడ్డు పక్కన ఉన్న షాపులకు పార్కింగ్ స్థలం లేకపో వడంతో వాహనాలు రోడ్డుమీదే వదిలేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు స్పందించి రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనదారులపై, దుకాణదారులపై చర్యలు తీసుకోకపోతే వీడీ రోడ్డు ఒక వాహన పద్మవ్యూహంగా ఉండిపోతుంది.

వర్షానికి కూలిన ఇల్లు

గుడిబండ, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకల్లు గ్రామంలోని తన ఇల్లు సోమవారం రాత్రి కురిసిన వర్షా నికి కూలిపోయినట్లు మంజునాథ్‌స్వామి తెలిపారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పాతఇల్లు నాని కూలిపోయిందని దీంతో ఇల్లులేక ఇబ్బంది పడుతున్నట్లు ఆయన పేర్కొన్నాడు. ప్రభుత్వం స్పందించి కూలిపోయిన ఇంటికి పరిహారం అందించ డంతోపాటు కొత్త ఇంటిని మంజూరు చేయాలని కోరాడు.

అంధకారంలో జమ్మానిపల్లి



వెలగని వీధిదీపాలు

మడకశిర రూరల్, డిసెం బరు 3 (ఆంధ్రజ్యోతి): మండలం లోని జమ్మానిపల్లి గ్రామంలో వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. అనేక సార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపో తున్నారు. ఇది సరిహద్దు గ్రామం కావడమేకాకుండా అడవికి దగ్గ రలో ఉండడంతో రాత్రి సమ యంలో పాముల బెడద అధి కంగా ఉంది. దీంతో రాత్రిపూట ఇళ్ల నుంచి బయటికి రావడానికి ప్రజలు భయపడుతున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరుగక ముందే వీధి దీపాలు అమర్చా లని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

సోమందేపల్లి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆత్మవి శ్వాసాన్ని పెంపొందించుకోవాలని అప్పుడే చదువులో రాణిస్తా రని డీఎస్పీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఈవ్‌టీజింగ్ చేస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. చదువుల్లో ఎవరైనా ఫెయిల్ అయితే నిరాశ చెందరాదన్నారు. పాసైనా ఫెయిలైనా ఒకేలా తీసుకోవాలన్నారు. అదేవిధంగా చదువుకునే వయసులో పెడ దారి పట్టకూడదన్నారు. సమాజంలో జరిగే అన్యాయాలపట్ల జాగరూకులై ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగా హన కలిగి ఉండాలన్నారు. తమకు ఏదైనా సమస్య వచ్చినా లేదా తోటి విద్యార్థులను ఎవరైనా వేధిస్తున్నా పోలీసులకు సమా చారం అందించాలన్నారు. అనంతరం గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ సుధా కర్, హెచ్‌ఎం నాగేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ప్రతిభను వెలికితీయాలి



హిందూపురంలో..



గుడిబండలో..

ప్రస్తుత సమాజంలో దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని జూనియర్ సివిల్ న్యాయాధికారి రాజ్యలక్ష్మి అన్నారు. దివ్యాంగుల్లో ప్రతిభను వెలికితీయాలని, అంగవైకల్యమనేది లక్ష్యసాధనకు అడ్డురాదన్నారు. ఎంజీఎం పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి మాట్లాడుతూ దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించడం గర్వించదగ్గ విషయమన్నారు. హిందూపురం, మడకశిర, పెనుకొండ, లేపాక్షి, అగళి, రొళ్ల, గుడిబండ తదితర ప్రాంతాల్లో మంగళవారం దివ్యాంగుల దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా పలుచోట్ల విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులను పంపిణీచేశారు. వారి ఆటపాటలు అందరినీ అలరించజేశాయి.

\- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



లేపాక్షిలో..



సోమందేపల్లిలో..



పెనుకొండలో..



మడకశిరలో..

వడ్రహట్టిలో తాగునీటి సమస్య పరిష్కారం



గంగపూజ చేస్తున్న మహిళలు

అగళి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) : అగళి మండలం వడ్రహట్టి గ్రామంలో కొన్ని ఏళ్లుగా నెలకొనిఉన్న తాగునీటి సమస్య పరిష్కార మైంది. గతంలో ఇక్కడ తాగునీటి సమస్యను గుర్తించిన టీటీడీ బోర్డు మెంబర్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి ఆదేశా లతో మంగళవారం బోరుబావి తవ్వడంతో నీరు పుష్కలంగా లభిం చాయి. ఎట్టకేలకు ఆ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారమైందని ఆ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఇరిగేపల్లి, హళ్లికెర, జగమరణపల్లి, అగళి, గ్రామాలలో బోరుబావులు తవ్వించడంతో నీరు పుష్కలంగా లభించాయి. ఆయా గ్రామ ప్రజలు, మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అగళి గ్రామంలో ఎన్టీఆర్ సుజలస్రవంతి తాగునీటి కోసం బోరుబావి తవ్వించడంతో వాటిలో కూడా నీరుపుష్కలంగా లభించింది.

అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య

అగళి, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక జయన్న(56) ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వీరేష్ తెలిపిన వివరాల మేరకు అగళి మండలం ఆర్‌జీపల్లి గ్రామానికి చెందిన జయన్న తన అవసరాల కోసం ఇతరుల నుంచి నాలుగు లక్షల రూపాయలు అప్పులు చేసి చెల్లించే విధానం తెలియక అప్పులవారి వేధిం పులు తట్టుకోలేక జీవితంపై విరక్తిచెంది ఇంటిలో ఎవరూ లేనిసమయంలో పైకప్పు ఇనుపరాడ్‌కు పంచెతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలి పారు. మృతుని కుమారుడు సుబ్బరాయ అలియాస్ సుబ్బు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఘనంగా వ్యవసాయ విద్యా దినోత్సవం

మడకశిర రూరల్, డిసెంబరు 3 :(ఆంధ్రజ్యోతి) జాతీయ వ్యవసాయ విద్యా దినోత్సవాన్ని మడకశిరలోని ఆచార్య ఎన్ జి రంగావ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో కళాశాల అసోషియేట్ డీన్ డాక్టర్ సరోజినిదేవి మాట్లాడుతూ ప్రజల జీవనంలో పురాతన కాలం నుంచి వ్యవసాయం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. వ్యవసాయ విద్యను ఉన్న ప్రాధాన్యత గుర్తించిన జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) ఏటా డిసెంబర్ 3న జాతీయ వ్యవసాయ విద్యా దినోత్సవంగా ప్రకటించిదన్నారు.

భారీ వర్షం.. వీధులు జలమయం



పెనుకొండలోని వీధిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

పెనుకొండ, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా పెనుకొండ పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలైన రామమందిరం వీధి, పంచాంగం వీధి, కుమ్మరిదొడ్డి, గండంగివీధి తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మడకశిరలో...

మడకశిర టౌన్: తుఫాను ప్రభావంతో రోజూ ఓ మోస్తారు వర్షం కురుస్తుండటంతో ప్రజలు బయటకు వచ్చేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నారు. మంగ ళవారం మధ్యాహ్నం మడకశిర పట్టణంలో ఓ మోస్తారు వర్షం కురిసింది. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడింది.

బోర్‌వెల్ లారీ డ్రైవర్‌కు 6నెలల జైలు శిక్ష

పెనుకొండ టౌన్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బోర్‌వెల్ లారీని నిర్లక్ష్యంగా నడిపి కురుబ నాగభూషణం మృతికి కారణం కావడంతో డ్రైవర్ నాగరాజుకు ఆరునెలల జైలుశిక్షను విధిస్తూ పెనుకొండ జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి బుజ్జప్ప తీర్పు వెల్లడించినట్లు కోర్టు కానిస్టేబుల్ బాబాజాన్ తెలిపారు. 2016ఆగస్టు1న సోమందేపల్లి మండలం కొనతట్టుపల్లి గ్రామంలో నరేంద్రరెడ్డి పొలంలో బోరువేసి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుని భార్య అంజలి ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదుచేసి దర్యాప్తు చేశారు. మంగళవారం పూర్వాపరాలు పరిశీలించి లారీ డ్రైవర్‌పై నేరం రుజువుకావడంతో ముద్దాయికి ఆరు నెలలు జైలుశిక్షతోపాటు రూ.10వేలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించనిపక్షంలో అదనంగా ఒక నెల జైలు శిక్షను అమలు చేయాలన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

హిందూపురం, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కర్నాటక నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యాన్ని హిందూపురం ఎక్సైజ్ పోలీసులు పట్టుకుని కేసు నమోదుచేసినట్లు ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య తెలి పారు. పరిగి మండలం మారెప్ప, మారుతితోపాటు మరొకరు ద్విచక్రవాహనంలో మద్యం తీసుకొ స్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ జీటీఎఫ్ సీఐ హరిక్రిష్ణ, ఎస్‌ఐలు పృథ్వీరాజ్, ఫారూక్‌లు దాడి చేసి వారి నుంచి ఐదు కేసుల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

గుట్టూరు గుజిరీ గోడౌన్‌లో అగ్నిప్రమాదం



గుజిరీ గోడౌన్‌లో చెలరేగుతున్నమంటలు

పెనుకొండ రూరల్, డిసెంబరు 3(ఆంధ్ర జ్యోతి): మండలంలోని గుట్టూరు వద్దగల వీవర్స్ సప్లయర్స్ గుజిరీ గోడౌన్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. కియా కార్లపరిశ్ర మకు సంబంధించి డోర్లకు అమర్చే బీడింగ్‌లు, రబ్బర్‌ను గుట్టూరులోని శ్రీరామిరెడ్డి లీజుకు తీసుకుని వీవర్స్ సప్లయర్స్ గుజిరీ గోడౌన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. కియ కార్లకు సంబం ధించి వ్యర్థపదార్థాలు కాల్చే క్రమంలో రబ్బ ర్‌కు అంటుకున్న నిప్పు ఒకదానికొకటి గోడౌన్ కు అంటుకుని మంటలు భారీగా చెలరేగాయి. గోడౌన్‌లో ఉన్న రేకుల షెడ్డుకు భారీగా మంటలు వ్యాప్తిచెంది దగ్ధమైంది. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ అధికారులు మల్లికార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో రూ.10వేలు ఆస్తినష్టం సంభవించిందని బాధి తుడు తెలిపారు.